Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 111 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 5 - 11 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## రెండు రైళ్లు ఢీ.. పలువురు మృతి




**జైరామ్‌నగర్:** ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం 4 గంటల ప్రాంతంలో ఘోర రైలు ప్రమాదం చోటు చేసుకుంది. జైరామ్‌నగర్ స్టేషన్ సమీపంలో గూడ్సు రైలును పాసిం జర్ రైలు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా, పలువురు గాయ పడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కోర్బా పాసింజర్ రైలు గూడ్సు రైలును ఢీకొనడంతో పాసింజర్ రైలు మొదటి బోగీ గూడ్సు రైలుపైకి ఎక్కినట్టు ఘటనా స్థలికి చెందిన వీడియోల్లో తెలుస్తోంది. ఘటన జరిగిన వెంటనే పెద్దఎత్తున జనం అక్కడికి చేరుకున్నారు. అధికారులు హుటా హుటిన సహాయక కార్యక్రమాలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసు పత్రికి తరలించారు. సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉన్నాయి.

## టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి నారా లోకేష్ 70వ రోజు ప్రజాదర్బార్

**- మంత్రి లోకేష్‌ను కలిసేందుకు పెద్దఎత్తున తరలి వచ్చిన ప్రజలు, కార్యకర్తలు - ప్రతిఒక్కరిని ఆప్యాయంగా పలకరించి వినతులు స్వీకరించిన మంత్రి - నాలుగు గంటల పాటు దాదాపు 4 వేల మందికి పైగా కలిసి సమస్యలు తెలుసుకున్న మంత్రి - ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని భరోసా**

**మంగళగిరి, (రాజధాని వార్తలు):** టీడీపీ కేంద్ర కార్యాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 70వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. మంత్రి నారా లోకేష్‌ను కలిసి సమస్యలు విన్నవిం చేందుకు రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ప్రజలు, కార్యకర్తలు పార్టీ కార్యాలయానికి తరలి వచ్చారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించిన మంత్రి నారా లోకేష్.. వారి నుంచి వినతులు స్వీకరించారు. నాలుగు గంటల పాటు దాదాపు 4 వేల మందికి పైగా కలిసి వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ప్రతి విజ్ఞప్తిని పరిశీలించి సిబ్బందికి అప్పటికప్పుడే ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వంలో అందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన విజ్ఞప్తులు**

వైసీపీ పాలనలో అక్రమ కేసులతో పాటు ఆస్తులు లాగేసుకున్నారు



టీడీపీ కార్యకర్తనైన తనపై వైసీపీ పాలనలో అక్రమ కేసులు నమోదు చేయడంతో పాటు ఆ పార్టీ నేతల ప్రోద్బలంతో తన భూమిని బలవంతంగా రిజిస్ట్రేషన్ (మిగతా 2వ పేజీలో)

## ఏపీలోని పలు జిల్లాల్లో భూప్రకంపనలు




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మంగళవారం తెల్లవారు జామున 4:19 గంటల సమయంలో భూకంపం సంభవించింది. కొన్ని సెకన్ల పాటు స్వల్ప ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. భూమి కంపించగానే ప్రజలు ఇళ్లలోంచి బయటకు పరుగులు తీశారు. విశాఖతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లా జిమాడుగులలో కూడా భూమి కంపించింది. 10 కిలోమీటర్ల లోతులో ప్రకంపనలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. రెక్టర్ స్కేల్‌పై 3.7గా తీవ్రత నమోదు అయినట్లు వెల్లడించారు. విశాఖలోని ఆరిలోవ, అడవివరం, మాధవధార, అక్కయ్యపాలెం, హెచ్‌బీ కాలనీ, అల్లిపురం, ఎండాడ, భీమిలిలో స్వల్ప భూప్రకంపనలు చోటు చేసుకున్నాయి. అలాగే.. సింహాచలంలోనూ స్వల్ప భూప్రకంపనలు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఒక్కసారిగా ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

## జగన్ హయాంలో రైతుల సమస్యలు అవినాశ్‌రెడ్డికి కనిపించలేదా.. అచ్చెన్నాయుడు

**అమరావతి, (రాజధాని వార్తలు):** కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిపై ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పేరు మీద వైసీపీ నేతలు చేస్తున్న నాటకాలు ఆపాలని హితవు పలికారు. కడప జిల్లాలో ఏమి జరుగుతోందో చూడని అవినాశ్‌కి.. ఇప్పుడు రైతులపై అంత ఆకస్మికంగా ప్రేమ ఎందుకు..? వచ్చిందని ప్రశ్నించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఉల్లి రైతులు నష్టపోకూడదని సీఎం చంద్రబాబు ఆలోచించి హెక్టార్‌కి రూ.50,000 చొప్పున అందజేయాలని నిర్ణయించారని తెలిపారు. తమ ప్రభుత్వంలో రూ.104 కోట్ల 57 లక్షల ఉల్లి రైతులకు లబ్ధి చేకూరుతుందని వెల్లడించారు మంత్రి అచ్చెన్నాయుడు. ఉల్లి ధరలు తగ్గుముఖం పట్టినప్పుడు క్వింటాకు రూ.1200 వెచ్చించి మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ ద్వారా కర్నూలు మార్కెట్‌నందు సుమారు రూ.17 కోట్ల 22 లక్షల విలువ గల ఉల్లి పంటను కొనుగోలు చేశామని చెప్పుకొచ్చారు. ఉల్లి పంట పాడవ్వకుండా రైతులకు తమ ప్రభుత్వం మేలు చేసిందని వివరించారు. 2020లో వైసీపీ హయాంలో ఉల్లి ధర పడిపోతే మద్దతు ధర రూ.770లు ప్రకటించడం తప్పా చేసిందేమీ లేదని విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో మార్క్ ఫెడ్ ద్వారా కేవలం 129 మంది రైతుల నుంచి 970 మెట్రిక్ టన్నుల ఉల్లిని మాత్రమే సేకరించి, రైతులకు కేవలం రూ.75 లక్షలు మాత్రమే చెల్లించిన విషయం అవినాష్ రెడ్డి గుర్తుంచుకోవాలని అన్నారు మంత్రి అచ్చెన్నాయుడు. జగన్ హయాంలో క్వింటాకు ఉల్లి ధర రూ.770 నిర్ణయించారని, కానీ రైతుల శ్రేయస్సు కోసం సీఎం చంద్రబాబు ఉత్తమ నిర్ణయంతో క్వింటాకు రూ.1200 పెట్టి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేశామని స్పష్టం



చేశారు. వైసీపీ హయాంలోని ఐదేళ్లలో రైతుల సమస్యలు అవినాశ్ రెడ్డికి కనిపించలేదా..? అని ప్రశ్నించారు. ఎన్నికలు వచ్చినప్పుడు, విపత్తుల సమయంలో మాత్రమే వైసీపీ నేతలు రైతుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు మంత్రి అచ్చెన్నాయుడు. గత ఐదేళ్లు రైతులు ఇబ్బందులు పడుతుంటే అవినాశ్ రెడ్డి కళ్లకు గంతలు కట్టుకుని ఉన్నారా..? అని ప్రశ్నించారు. నష్టపరిహారం ఫైళ్లు పెండింగ్‌లో పెట్టింది కూటమి ప్రభుత్వం కాదని, గత జగన్ ప్రభుత్వ గందరగోళ విధానాలేనని ఎద్దేవా చేశారు. రైతుల పేరు చెప్పుకుంటూ రాజకీయ లాభం చూడటం అవినాశ్‌రెడ్డి స్వభావమని విమర్శించారు. సీఎం చంద్రబాబు గురించి మాట్లాడే కనీస అర్హత అవినాశ్‌రెడ్డికి లేదని ఫైర్ అయ్యారు. రైతుల కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఉద్ఘాటించారు. అన్నదాతలకు అందచేస్తున్న పథకాలు, ధరలు తగ్గినప్పుడు వారికి ఇస్తున్న పరిహారాలు వైసీపీ నేతల కళ్లకు కనపడటం లేదా..? అని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నల వర్షం కురిపించారు.

## దుబాయ్‌లో రెండో రోజు కొనసాగుతున్న మంత్రి నారాయణ పర్యటన



**దుబాయ్ :** రాష్ట్రానికి పెట్టుబడుల సాధన కోసం దుబాయ్‌లో పర్యటిస్తున్న మంత్రి. మంగళవారం ఉదయం అపరెల్ గ్రూప్ చైర్మన్ నీలేష్ వేద్‌తో భేటీ అయిన మంత్రి. ఫ్యాషన్, ఫుట్‌వేర్ రంగాల్లో 14 దేశాల్లో ప్రసిద్ధి పొందిన అపరెల్ గ్రూప్ ఏపీలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా అపరెల్ గ్రూప్ ప్రతినిధులను ఆహ్వానించిన మంత్రి నారాయణ. ట్రాన్స్ వరల్డ్ గ్రూప్ చైర్మన్ రమేష్ రామకృష్ణన్‌తో భేటీ అయిన మంత్రి నారాయణ. షిప్పింగ్, లాజిస్టిక్స్ రంగంలో దుబాయ్ కేంద్రంగా అనేక దేశాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్న ట్రాన్స్ వరల్డ్ గ్రూప్. రాష్ట్రంలో లాజిస్టిక్స్ రంగం అభివృద్ధికి సీఎం చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలను వివరించిన మంత్రి. ఏపీని లాజిస్టిక్ హబ్‌గా మార్చేందుకు చర్యలు చేపట్టామని వెల్లడి. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని ఆయా కంపెనీలకు ఆహ్వానం పలికిన మంత్రి నారాయణ.

## గిరిజన ప్రాంతాల మహిళల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు : మంత్రి సంధ్యారాణి

**అమరావతి, (రాజధాని వార్తలు):** గిరిజన ప్రాంతాల్లో ఉండే మహిళల సంక్షేమం కోసం ఏపీ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిం దని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వ్యాఖ్యానించారు. గిరిజన మహిళలు రక్తహీనతకి గురి కాకుండా ప్రత్యేక శ్రద్ధ చూపామని పేర్కొన్నారు. సికిల్ సెల్ ఎనీ మియాతో బాధపడుతున్న వారి కోసం విశాఖపట్నం కేజీహెచ్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో బాలింతలు, గర్భవతులకు సకాలంలో పౌష్టికాహారం అందిస్తున్నా మని చెప్పుకొచ్చారు. మంగళవారం వెలగపూడిలోని సచివాలయంలో మీడియాతో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడారు. గిరిజన విద్యార్థుల సంక్షేమం కోసం ఈ ఏడాది తమ ప్రభుత్వం రూ.113 కోట్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. 30 గురుకుల పాఠశా లలు, 83 ఆశ్రమ పాఠశాలల్లో ఈ నిధులతో మౌలిక వసతులు కల్పించామని స్పష్టం చేశారు. గత ఏడాది రూ.155 కోట్లు మం జూరు చేశామని చెప్పుకొచ్చారు. గిరిజన ప్రాంతాల్లో ఈఎంఆర్ఎస్ లతో కలిపి 199 గురుకుల పాఠశాలలు, 558 రెసిడెన్షియల్ స్కూల్స్ ఉన్నాయని తెలిపారు. వీటన్నింటిలో పూర్తిగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా 2012 టాయి లెట్స్ మంజూరు చేశామని తెలిపారు. ఆర్వో ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. గత జగన్ ప్రభుత్వం ట్రైకార్ లోన్స్ ఇవ్వలేదని.. అయితే, తమ ప్రభుత్వం రూ.24 కోట్లతో గోకులాలు ఏర్పాటు చేసి గిరిజనులకు




ఉపాధి కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. పాడిపరిశ్రమ అభివృద్ధి చెందితే గిరిజనులకు స్వయం ఉపాధి ఉం టుందని నొక్కి చెప్పారు. ఇంటికి ఒక పారిశ్రామికవేత్త ఉండాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన అని ఉద్ఘాటించారు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి. పాడి పరిశ్రమ, పాల పరిశ్రమ అభివృద్ధి చెందితే గిరి జనులకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధ్యాయుల పోస్టులని వెంటనే భర్తీ చేశామని తెలిపారు. పార్వతీపురం, మన్యం జిల్లాల్లో 150 మంది విద్యార్థులకు ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ కోచింగ్ ఇస్తున్నామని అన్నారు. గతంలో గిరిజన ప్రాంతాల్లో భూములు పొందేందుకు గిరిజన యువతులను పెళ్లిళ్లు చేసుకొని మోసం చేసేవారని... అటువంటి సంఘటనలు జరుగకుండా తమ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు.

## రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోయింది : నయినార్ నాగేంద్రన్



**చెన్నై:** రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని, ప్రతిరోజు లైంగిక వేధింపులు, అత్యాచారాలు జరుగుతున్నాయని, దీనిని అడ్డుకోవడంలో డీఎంకే ప్రభుత్వ విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ అన్నారు. కోవైలో ఆదివారం అర్ధరాత్రి కళాశాల విద్యార్థినిపై సామూహిక అత్యాచార ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ఈ నేపథ్యంలో, కోవైలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ మహిళా విభాగం అధ్యక్షురాలు వానతీ శ్రీనివాసన్‌తో కలిసి నయినార్ నాగేంద్రన్ మీడియాతో మాట్లాడారు. 2021వ సంవత్సరంలో డీఎంకే ప్రభుత్వం అధికారంలో కూర్చున్నప్పటి నుంచి రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని, డీఎంకే ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదని నయినార్ నాగేంద్రన్ ఆరోపించారు. పోలీస్ శాఖ కూడా ప్రజా రక్షణలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, విమర్శించారు. డీఎంకే ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో బీజేపీ తరుపున ఆందోళనలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆ తర్వాత వానతీ శ్రీనివాసన్ మాట్లాడుతూ, అత్యాచారానికి పాల్పడిన వారిపై గూండా చట్టం ప్రయోగించి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు.

## రహదారుల నాణ్యతలో రాజీపడబోం.. అధికారులకి పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

**అమరావతి, (రాజధాని వార్తలు):** 'సాస్కి' పథకం ద్వారా నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. ప్రజలకు 'సాస్కి' నిధుల ఫలాలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ శాఖల అధికారులకి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు డిప్యూటీ సీఎం. గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులకు రూ.2 వేల కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం సమకూర్చిందని స్పష్టం చేశారు పవన్ కల్యాణ్.

**ఆ బాధ్యత అధికార యంత్రాంగానిదే..**

సాస్కి నిధులతో నిర్మించే రోడ్లలో ఎక్కడ నాణ్యతా ప్రమాణాలు తగ్గకూడదని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో బాధ్యత అధికార యంత్రాంగానిదేనని ఆజ్ఞాపించారు. రోడ్ల నిర్మాణ దశ నుంచి పూర్తయ్యే వరకూ అధికారులు పరిశీలించాలని హుకుం జారీ చేశారు.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గద ర్శకంలో మరో ముందడుగు వేశామని ఉద్ఘాటించారు పవన్ కల్యాణ్. ఏపీలోని గ్రామాల్లో రహదారుల స్థితిగతులను మార్చి నూతన రోడ్లు నిర్మించడానికి కేంద్రప్రభుత్వం 'సాస్కి' పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు రూ. 2 వేల కోట్లు నిధులు సమకూర్చిం దని వ్యాఖ్యానించారు. ఈ నిధులతో ప్రజలకు పటిష్టమైన రహదారులు అందించే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్లను పునర్నిర్మించే కార్యక్రమం చేపడుతున్నామని చెప్పుకొచ్చారు పవన్ కల్యాణ్.

**దెబ్బతిన్న రోడ్లకు మొదటి ప్రాధాన్యం..**

ఈ క్రమంలో దెబ్బతిన్న రోడ్లకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నుంచి అందుతున్న సహకారంతో ఏపీకి సాస్కి నిధులు సమకూరాయని చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో వీటిని సద్వియోగం చేసుకుందామని సూచించారు.

# వైభవంగా సితార ఎంటర్టైన్మెంట్ ద్వితీయ వార్షికోత్సవ సంబరాలు

**- కృష్ణారెడ్డి చేతుల మీదుగా ప్రతిభ చూపిన కళాకారులకు పురస్కార అవార్డులు - ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు - ప్రతిభ చూపిన కళాకారులకు సితార రత్న పురస్కార్ అవార్డులు - అతిథులకు ఘన సన్మానం**












**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని టౌన్ హాల్ నందు సితార ఎంటర్టైన్మెంట్, అసోసియేషన్ పబ్లిక్ హ్యూమన్ రైట్స్ కన్వెన్షన్ (ఏపీ హెచ్ఆర్సీ) సంయుక్త ఆధ్వర్యంలో వైభవంగా సితార ఎంటర్టైన్మెంట్ ద్వితీయ వార్షికోత్సవ సంబరాలు జరిగాయి. నెల్లూరు టౌన్ హాల్లో సితార ఎంటర్టైన్మెంట్ అధినేత కారసాల కుమార్, అసోసియేషన్ పబ్లిక్ హ్యూమన్ రైట్స్ కన్వెన్షన్ ఫౌండర్ అండ్ చైర్మన్ నడిమింటి చంద్రకళా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వార్షికోత్సవ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా 25 కళాశాల అధ్యక్షులు అమరావతి కృష్ణారెడ్డి. మహేశ్వరి మెడికల్ ఫ్యాన్సీ అనిష్, చక్ర సిమెంట్ డిస్ట్రిబ్యూటర్ ఆంజనేయ రెడ్డి, తెలుగు భాష కల్చరల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు ధనాసి ఉషారాణి, ఎస్వీఆర్ విద్యాసంస్థల అధినేత శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు సితార ఎంటర్టైన్మెంట్, ఏ పి హెచ్ ఆర్ సి సంస్థల ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఆదివారం ఉదయం 10 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు జరిగిన నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి అనంతరం దాదాపు 50 మంది కళాకారులను సితార రత్న పురస్కారాల అవార్డులతో పాటు శాలువా పుష్ప గుచ్చాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను చేస్తున్న కుమార్‌ను, నడిమింటి చంద్రకళారెడ్డిని కళాకారులు, అభిమానులు అభినందించి ఆశీర్వదించారు. మరెన్నో సేవా కార్యక్రమాలను చేయాలని ఆ సేవా కార్యక్రమాల విజయానికి తాము ముందు ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాకారులు, అభిమానులు, సితార ఎంటర్టైన్మెంట్ అసోసియేషన్ సభ్యులు, అసోసియేషన్ పబ్లిక్ హ్యూమన్ రైట్స్ కన్వెన్షన్ అసోసియేషన్ నేతలు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి నారా లోకేష్ 70వ రోజు ప్రజాదర్బార్

(మొదటి పేజీ తరువాయి)

చేసుకున్నారని, విచారించి తగిన న్యాయం చేయాలని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం బుడ్డేపుపేట గ్రామానికి చెందిన దనపాన హరికృష్ణ మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. విచారించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. తనకు వారసత్వంగా సంక్రమించిన వ్యవసాయ భూమిని తప్పుడు పత్రాలతో కబ్జా చేసేందుకు వైసీపీ కార్యకర్త అన్నలదాసు జోసెఫ్ యత్నిస్తున్నారని, విచారించి తగిన న్యాయం చేయాలని గుంటూరు జిల్లా కాకుమాను గ్రామానికి చెందిన మెరిగల రవిబాబు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. టీడీపీ సానుభూతిపరుడిననే కక్షతో అతిథి అధ్యాపకుడిగా పనిచేస్తున్న తనను వైసీపీ హయాంలో విధుల నుంచి తొలగించారని, తిరిగి తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన ఉలిద్ర రవి మంత్రి నారా లోకేష్‌ను కలిసి విన్నవించారు. పరిశీలించి తగిన న్యాయం చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలోని పారామెడికల్ విభాగంలో ఖాళీగా ఉన్న హెల్త్ అసిస్టెంట్ మేల్ పోస్టుల భర్తీకి తగిన చర్యలు తీసుకోవాలని అన్ ఎంప్లాయిస్ పారా మెడికల్ హెల్త్ అసిస్టెంట్ (మేల్) అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. టీడీపీ పాలనలో ఎంపీహెచ్ ఏ మేల్ పోస్టులను భర్తీ చేశారు. గత కొన్నేళ్లుగా హెల్త్ అసిస్టెంట్ మేల్ పోస్టులకు సంబంధించి ఎలాంటి నోటిఫికేషన్లు ఇవ్వడం లేదని మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. శ్రీశైలం ఐటీడీఏ (పీటీజీ) చెంచు ప్రాజెక్ట్ కార్యాలయం పరిధిలోని ప్రకాశం జిల్లా అటవీ ప్రాంతంలోని గిరిజన చెంచు, ఆదివాసి గూడెంల్లో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా నూతన పాఠశాలల మంజూరుకు తగిన చర్యలు తీసుకోవాలని నల్లమల గిరిజన చెంచు (పీటీజీ) సంక్షేమ సంఘం ప్రతినిధులు మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. ఏపీ జెన్ కో, ట్రాన్స్ కో, డిస్కమ్స్‌లో పనిచేస్తున్న సుమారు 23,500 మంది కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్ర రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. వేతన సవరణ చేయడంతో పాటు ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి తీవ్ర అనారోగ్యం పాలైన తనకు సీఎం ఆర్ఎఫ్ ద్వారా వైద్యసాయం అందించి ఆదుకోవాలని చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురం మండలం కన్నికాపురం గ్రామానికి చెందిన కె.ప్రకాశ్ బాబు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలంలో సైన్స్, ఆర్ట్స్, ఒకేషనల్ కోర్సులతో కూడిన ప్రభుత్వ జూనియర్ కాలేజీని ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతానికి చెందిన బి.ఎమ్ కిషోర్ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదివేందుకు విద్యార్థులు సుదూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, దీంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ కొత్తూరు తాడేపల్లిలో విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన గరిమెళ్ల అనిల్ కుమార్ మంత్రి నారా లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు.

విజయవాడ-విసన్నపేట ఆర్ అండ్ బీ రోడ్డును ఆక్రమించి ఆక్రమణదారులు భారీ కట్టడాలు నిర్మిస్తున్నారని, అక్రమ నిర్మాణాలు తొలగించాలని అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేదని మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

# శ్రీశైలంలో కార్తీక కోటి దీపాన్ని వెలిగించిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మ







**కోవూరు, (రాజధాని వార్తలు):** పవిత్ర కార్తీక మాస సోమవారం సందర్భం గా కోవూరు ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శ్రీశైలం మహా పుణ్య క్షేత్రంలో కార్తీక కోటి దీపం వెలిగిం చారు. సోమవారం శ్రీశైలం వెళ్లిన ఆమె ఈ సందర్భంగా దీపం వెలిగించి శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. కార్తీక మాస సోమవారం సందర్భంగా కోటి దీపం వెలిగించడం సంతోషంగా ఉందని ఆమె పేర్కొన్నారు. స్వామి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, బెజవాడ వంశీ రెడ్డి, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రానైట్ కటింగ్ అండ్ పాలిషింగ్ పరిశ్రమకు ప్రభుత్వం అండగా ఉంటుంది

**- సీనరేజి చెల్లింపు విషయంలో సానుకూల నిర్ణయం తీసుకుంటాం - ప్రభుత్వానికి పరిశ్రమలకు నష్టం లేకుండా చర్యలు - ప్రభుత్వ యంత్రాంగం, పరిశ్రమల అసోసియేషన్ ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు - ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల గ్రానైట్ కటింగ్ అండ్ పాలిషింగ్ పరిశ్రమల అసోసియేషన్ ప్రతినిధులకు మంత్రి కొల్లు రవీంద్ర హామీ**



**అమరావతి, (రాజధాని వార్తలు):** గ్రానైట్ కటింగ్ అండ్ పాలిషింగ్ పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరించి, వారికి తగు న్యాయం చేస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సచివాలయంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, బి.ఎన్.విజయ్ కుమార్‌తో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని గ్రానైట్ కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్ల అసోసియేషన్ ప్రతినిధులు సమావేశమయ్యారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రులకు వివరించారు. అన్ని గ్రేడ్ల ముడి సరుకుకు కూడా ఒకే విధంగా సీనరేజి చెల్లించడం ఆర్థికంగా ఇబ్బంది కలుగుతోందని, ఆ సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. ప్రభుత్వానికి, కటింగ్ యూనిట్స్ నిర్వాహకులకు ఎలాంటి నష్టం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సమ్మె కారణంగా ఫ్యాక్టరీలపై ఆధారపడిన కార్మికులు అవస్థలు పడతారని, తక్షణమే సమ్మె విరమించి పనులు ప్రారంభించాలని గ్రానైట్ కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్ యజమానులకు సూచించారు. ఫ్యాక్టరీలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం లక్ష్యంగా మైనింగ్ జేడీ, జిల్లా డీఎంజీవో, సీనరేజి వసూలు సంస్థ ప్రతినిధి, ప్రతి అసోసియేషన్ నుండి ఇద్దరు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులతో చర్చించి వారం రోజుల్లో నివేదిక అందించాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు.

# మెట్ట ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం విపిఆర్

**ఎంపీ వేమిరెడ్డి సహకారంతో ఉదయగిరి ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాను : ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్**






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విపిఆర్ ఫౌండేషన్ ద్వారా చేపట్టే ప్రతి సేవా కార్యక్రమాన్ని ఉదయగిరి నుంచే ప్రారంభించడం మెట్ట ప్రాంతం ప్రజలపై ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి ఉన్న ప్రత్యేక అభిమానమే కారణమని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. వరికుంటపాడు మండలం రామాపురం గ్రామంలో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రారంభించిన విపిఆర్ నేత్ర కార్యక్రమాన్ని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ గత 40 ఏళ్లలో ఈ ప్రాంతం నుంచి ఎంపిగా ప్రాతినిధ్యం వహించిన ఏ ఒక్కరు కూడా ఉదయగిరి ప్రాంతాన్ని పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గత 18 నెలల కాలంలో దాదాపు పదిసార్లు పైగా ఉదయగిరి ప్రాంత అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారని ఆయన గుర్తు చేశారు. ఫ్లోరైడ్ ప్రభావిత మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో 36 వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేసి ప్రజలకు సురక్షిత తాగునీరు అందించిన ఘనత ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఉదయగిరి ప్రాంతంలో నడవలేని దివ్యాంగులకు 164 ట్రై సైకిళ్లు ఉచితంగా అందజేసి తన దాతృత్వం చాటుకొన్న విపిఆర్ సేవలను ఎమ్మెల్యే కాకర్ల కొనియాడారు. ప్రజలకు సేవ చేసేందుకు రెండే వేదికలు ఉన్నాయని, అందులో ఒకటి రాజకీయమైతే రెండోది స్వచ్ఛంద సంస్థల ద్వారా అందించే ప్రతిఫలం ఆశించని సేవ అన్నారు. రెండింటి ద్వారా ప్రజా సేవ చేస్తూ ఎంపి వేమిరెడ్డి ఆదర్శంగా నిలిచారన్నారు. కంటి వైద్యానికి సంబంధించి అనుభవజ్ఞులైన డాక్టర్లు, అత్యాధునిక వైద్య సౌకర్యాలతో ఇంత ఖరీదైన బస్సు ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎవరు ఏర్పాటు చేయలేదన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహాయ సహకారాలతో ఉదయగిరి ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తానన్నారు. కోవూరు నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్నారని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ని ఆయన ప్రశంశించారు. కంటి సమస్యలకు సంబంధించి విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్న విపిఆర్ నేత్ర సేవలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కాకర్ల సురేష్ ఉదయగిరి ప్రజానీకానికి పిలుపునిచ్చారు.

తెలుగుదేశం మరియు కుటుంబ పార్టీల నాయకులు విపిఆర్ నేత్ర అందిస్తున్న ఉచిత వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సేవా కార్యక్రమా లను మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చంచల బాబు యాదవ్, నెల్లూరు డిప్యూటీ మేయర్ గురు కుమార్ యాదవ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు ఎల్‌సి రమణారెడ్డి, మన్నేటి వెంకటరెడ్డి, స్థానిక జడ్పిటిసి రావెళ్ళ నాగేంద్ర, రామాపురం సర్పంచ్ పెంచలమ్మ, మండల టిడిపి కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు, జనసేన నాయకులు కొట్టే వెంకటేశ్వర్లు, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

# తుళ్లూరు పోలీస్ సబ్ డివిజన్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన హోంమంత్రి అనిత

**అమరావతి, (రాజధాని వార్తలు):** తుళ్లూరు పోలీస్ సబ్ డివిజన్ నూతన కార్యాలయాన్ని హోంమంత్రి వంగలపూడి అనిత మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ... తుళ్లూరు పోలీస్ సభ డివిజన్ కొత్త ఆఫీస్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందని.. దీని గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలని అన్నారు. 2014లో సీఎం చంద్రబాబు అమరావతి నిర్మాణం ప్రారంభించారని గుర్తు చేశారు. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ కార్యాలయం పూర్తి కాకుండా ఉందని తెలిపారు. రాజధాని కొరకు రైతులు ఉచితంగా భూములు త్యాగం చెయ్యడం గొప్ప విషయమన్నారు. అమరావతి రైతుల కష్టం.. ప్రతి ఫలమే ఇవాళ అందరూ చూస్తునారని హోంమంత్రి అన్నారు. ఈ బిల్డింగ్ పూర్తి చేయడానికి ఎస్పీ వకుల్ జిందల్, డీఎస్పీ మురళీ కృష్ణ చాలా కృషి చేశారని కొనియాడారు. పోలీస్ వ్యవస్థను బాగా బలోపేతం చేసేందుకు డీజీపీ కృషి చేస్తున్నారని తెలిపారు. పోలీసులకు కావాల్సిన అన్ని ఫెసిలిటీస్ కూడా ఈ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని చెప్పారు. పోలీసులకు కోటి రూపాయలు వరకు భీమా కల్పించామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే 6100 మంది కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక్క కానిస్టేబుల్ ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు. పోలీసు చనిపోతే.. వారి కుటుంబానికి అండగా ఉంటామని.. భీమా ద్వారా కనిష్టంగా రూ.15 లక్షలు ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. ఈ సబ్ డివిజన్‌లో సిబ్బంది కొరత ఉందని.. త్వరలో అన్నీ ఫుల్ ఫిల్ చేస్తామని హోంమంత్రి స్పష్టం చేశారు. కల్పిత వీడియోల ద్వారా చాలా మంది ఇబ్బంది పెడుతున్నారని.. అలాంటి వాటిని ఏపీ పోలీసులు సమర్థవంతంగా ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ మధ్య కాలంలో ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓ లారీపై రాళ్లు వేసిన వీడియోను.. ఆంధ్రప్రదేశ్‌లో జరిగినట్లు వైసీపీ ప్రచారం చేసిందని మండిపడ్డారు. ఇలాంటి తప్పుడు వార్తలను ఏపీ పోలీసులు సమర్ధవంతంగా ఎదుర్కొన్నారని తెలిపారు. టెక్నాలజీ ఉపయోగించి.. తప్పుడు వార్తలు స్ప్రెడ్ కాకుండా చూడాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.



# కంటి చూపులేని కళ్ళకు వెలుగు రేఖ విపిఆర్ నేత్ర

**- అఖండ ప్రజాశీసుల మధ్య వైభవంగా ప్రారంభమైన విపిఆర్ నేత్ర యాత్ర - ప్రారంభించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రశాంతమ్మ, కాకర్ల సురేష్ - ఉదయగిరి ప్రాంత ఆరాధ్య దైవం ప్రభాకర్‌రెడ్డి - అరగంటలోనే కంటి అద్దాలు ఇచ్చేలా ఏర్పాట్లు - హర్షం వ్యక్తం చేస్తున్న పెద్దలు, మహిళలు - మా కంటికి ఇన్నేళ్లకు వెలుగొచ్చిందని సంబరాలు**









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** చూపు సన్నగిల్లిన బ్రతుకులు ఆశలు చిగురించిన వేళ.. కళ్ళున్నా చూడలేని జీవితాల్లో వెలుగు నిండిన వేళ.. ప్రజాకాంక్షను మోస్తూ వారి ఆకాంక్షలు నెరవేరుస్తూ కదిలిచ్చిందో రథం. బడుగు జీవులకు నేనున్నానంటూ చూపించిందో పథం..పేదల పెన్నిధిగా, అభాగ్యులకు అండగా.. నిరంతర శ్రామికుడిగా.. సేవకు నిలువెత్తు రూపంగా నిలిచే వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి.. తన అమృత హస్తాలతో ప్రారంభించిన విపిఆర్ నేత్ర యాత్ర ఎంతోమందికి చూపునిచ్చేందుకు, దారి చూపేందుకు సిద్ధమైంది. అఖండ ప్రజాశీసుల మధ్య రామాపురం గ్రామంలో వేడుకగా ప్రారంభమైంది. నీరింకిన కళ్ళకు కంటి వెలుగై.. బరువెక్కిన గుండెలకు ఆపద్బాంధవుడై.. ప్రజా సేవలో మేరు పర్వతమైన నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆయన సతీమణి కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన విపిఆర్ నేత్ర కార్యక్రమాన్ని సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా గ్రామానికి చేరుకున్న వేమిరెడ్డి దంపతులకు, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కి గ్రామస్తులు, నాయకులు భారీ గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన విపిఆర్ నేత్ర బస్సును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటిచూపు సరిగా లేని పలువురికి వైద్య సిబ్బంది కంటి పరీక్షలు చేసి అక్కడికక్కడే కంటి అద్దాలు అందజేశారు. వందలాదిమంది వృద్ధులు, మహిళలు, పెద్దవారు కంటి పరీక్షలు చేయించుకుని, ఇన్నాళ్లకు తమ చూపు స్పష్టంగా ఉందంటూ సం తోషాన్ని వ్యక్తం చేస్తూ మురిసిపోయారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై నుంచి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తన ప్రసంగాన్ని అందించారు. తనను కలిసిన ఒక వృద్ధుడి అవస్థ నుంచి పుట్టిన కార్యక్రమమే విపిఆర్ నేత్ర అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి సమస్యలపై అవగాహన లేక ఎంతో మంది తమ చూపును నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. విపిఆర్ ఫౌండేషన్ తరపున ఇప్పటికే గ్రామస్థులకు తాగడానికి నీరు, దివ్యాంగులు ఆత్మ ధైర్యంతో బతికేందుకు ట్రై సైకిల్స్, పేద పిల్లలు చదువుకునేందుకు విపిఆర్ విద్య వంటివి ఏర్పాటు చేశామన్నారు. జిల్లా ప్రజలకు ఇంకా ఏదో చేయాలన్న తపన నుంచి విపిఆర్ నేత్ర కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు. మానవ శరీరంలో కళ్ళు అతి ముఖ్యమైనవని, కంటి చూపు లేకుంటే జీవితం అంధకారమేన న్నారు. అంతటి ముఖ్యమైన నేత్రాలతో ఈ అందమైన ప్రపంచాన్ని చూపించేందుకు విపిఆర్ నేత్ర తోడు ఉంటుందని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజలను తన సొంత బిడ్డలుగా చూసుకుంటున్నారని, ప్రతి నియోజకవర్గంలో 5 నుంచి 6 కోట్ల వరకు సీఎం రిలీఫ్ ఫండ్ ఇచ్చి ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని జిల్లా వ్యాప్తంగా విపిఆర్ నేత్ర కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. అందులో భాగంగా తనకు ఎంతో ఇష్టమైన ఉదయగిరి ప్రాంతం





నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఉదయగిరి ప్రాంతమన్నా, ఇక్కడి ప్రజలన్నా తనకు ఎంతో అభిమానమని ఆయన చెప్పారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మద్దతు లేకపోతే ఈ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా ప్రారంభించలేమన్నారు. అలాగే తనతో గత 2 నెలలుగా ప్రయాణం చేస్తున్న డాక్టర్ కృష్ణ ప్రసాద్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. స్థానిక నాయకుల మద్దతు ఈ కార్యక్రమ విజయవంతంలో ఎంతో ఉంటుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తనకు తమ్ముడి లాంటి వారని, నిరంతరం ప్రజల గురించి ఆలోచిస్తూ పనిచేస్తున్నారన్నారు. ఆయనతో కలిసి ఈ కార్యక్రమాన్ని లాంచ్ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఎంతో ఉన్నత ఆశయంతో చేపట్టిన విపిఆర్ నేత్ర కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రతి నాయకుడు, కార్యకర్త పని చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ విపిఆర్ నేత్రలో భాగస్వాములు కావాలని కోరారు. ఉదయగిరి ప్రజల ఆకాంక్ష అయిన సోమశిల హైలెవెల్ కెనాల్ పూర్తి, వెలుగొండ ప్రాజెక్టు నుంచి నీటిని తెచ్చే బాధ్యతను తాము తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ఉదయగిరి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీ జడ్పి ఛైర్మన్ చెంచలబాబు బాబు యాదవ్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు నాగేంద్ర, స్థానిక నాయకులు చంద్ర మధుసూదన రావు, ఇతర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారుల సంతృప్తే ప్రధాన లక్ష్యం

**- వృద్ధులు, దివ్యాంగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టండి - ప్రతి అర్జీని జాప్యం లేకుండా నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** అర్జీదారులు సంతృప్తి చెందేలా ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లతో పాటు జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్‌వో విజయకుమార్, జడ్పీ సిఇవో మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగా భవాని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ పిజిఆర్‌ఎస్ అర్జీల పట్ల జాప్యం లేకుండా ప్రతి అర్జీని నిర్ణీత గడువులోపు పరిష్కరించాల న్నారు. వృద్ధులు, దివ్యాంగుల సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి మానవతా దృక్పథంతో పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవా లని సూచించారు. ఏ శాఖ పరిధిలో కూడా అర్జీలు పెండింగ్‌లో ఉండకూడదన్నారు. ప్రతిరోజూ తమ లాగిన్‌లలో అర్జీలను స్టేటస్ పరిశీలించి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబం ధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాల న్నారు. ప్రతి అర్జీని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కమ్మపల్లి గిరిజన కాలనీలో కోటి సంతకాల సేకరణ









**డక్కిలి, (రాజధాని వార్తలు):** డక్కిలి మండలం కేంద్రంలో వెంబులూరు పంచాయతీలో కమ్మపల్లి గిరిజన కాలానీల్లో కోటి సంతకాల సేకరణ మొట్టమొదటిసారిగా నియోజకవర్గం కన్వీనర్ నేదురమల్లి రాంకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మొదలు పెట్టారు. ఈ కార్యక్రమంలో చింతల శ్రీనివాసుల రెడ్డి సూచనల మేరకు డక్కిలి వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు కొలపూడి. వేణుగోపాల్ మాట్లాడుతూ వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో వై ఎస్ ఆర్ పార్టీ ప్రభుత్వం స్థాపించిన కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నలను తీవ్రంగా వెతిరేకిస్తున్నాం. ఈ కాలేజీలు ప్రజా నిధులతో, పేద మరియు మధ్య తరగతి విద్యార్థులు ప్రయోజనార్థం జిల్లాల వారీగా వైద్య, విద్య మరియు వైద్యసేవలు అందించేందుకు స్థాపించబడ్డాయి అని తెలియజేసారు. ప్రవేటీకరణ జరిగితే పేద విద్యార్థులకు వైద్య విద్య అందనంత దూరమౌతుంది. ఫీజులు భరించలేనంతగా పెరుగుగుతాయ్. ఈ కార్యక్రమంలో కమ్మపల్లి గిరిజన కాలానీలో వైసిపి కార్యకర్తలు, మహిళలు, కమ్మపల్లి వేణుగోపాల్ నాయుడు, మండలం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యమే తొక్కిసలాటకు కారణం




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాటకు కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యమే ప్రధాన కారణమని పెద్దాపురం నియోజవర్గం వైసీపీ ఇన్చార్జ్ దవులూరి దొరబాబు ఆరోపించారు. కాశీబుగ్గలో జరిగిన తొక్కిసలాట ప్రమాదంలో మృతి చెందిన భక్తుల ఆత్మశాంతి కోసం వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు పాగా సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సామర్లకోట రైల్వే స్టేషన్ గడియార స్తంభం సెంటర్ నుండి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మరణించిన వారికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దా పురం నియోజకవర్గ ఇంచార్జ్ దవులూరి దొరబాబు పాల్గొని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే కాశీబుగ్గలో తొక్కిసలాట ఘటన చోటు చేసుకుందని విమర్శించారు. ప్రమాదంలో గాయపడిన భక్తులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు ఊబా జాన్ మోజెస్, నెక్కంటి సాయి ప్రసాద్, వైసీపీ రాష్ట్ర అయ్యాక విభాగం అధ్యక్షులు ఆవాల లక్ష్మీ నారాయణ, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పార్టీ నాయకులు ఇరుసుమళ్ళ సాయి, వైసీపీ కౌన్సిలర్లు సేపేని రూప సురేష్, పాలికి కుసుమ చంటిబాబు, మండల వైసీపీ అధ్యక్షులు తలారి దొరబాబు, నాయకులు రెడ్నం దొరబాబు, కరణం రాజ్‌కుమార్, లింగం శివప్రసాద్, మోరంపూడి రంగ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# విపిఆర్ నేత్ర ప్రారంభోత్సవం రోజునే 64 మందికి కంటి పరీక్షలు

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఎంతో ఉన్నత ఆశయంలో, గొప్ప సంకల్పంతో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, విపిఆర్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి గార్లు ప్రారంభించిన విపిఆర్ నేత్ర కు తొలిరోజు ప్రజల నుంచి భారీగా స్పందన వచ్చింది. ప్రారంభోత్సవం సందర్భంగా తొలి రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 64 మందికి విపిఆర్ నేత్ర బస్సులో కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 50 మందికి కంటి అద్దాలను ఉచితంగా అందజేశారు. వారికి తగిన సూచనలు చేశారు. విపిఆర్ నేత్ర బస్సును రేపటి నుంచి రామాపురం గ్రామంలోని సచివాలయం వద్ద ప్రజలకు అందుబాటులో ఉంచనున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రామాపురం పంచాయతీ పరిధిలోని ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించనున్నారు.




రేపు రామాపురం పంచాయతీ అనంతరం వరికుంటపాడు మండలంలోని మరో పంచాయతీలో బస్సును ఏర్పాటు చేయనున్నారు. కాబట్టి రామాపురం పంచాయతీ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

# సంపాదకీయం

## జొహ్రాన్.. మీరా.. మమ్దానీ.. సంస్కృతీ మథనం

"సంస్కృతి అనే పదాన్ని నేను విన్నప్పుడు నా పిస్టల్‌ను పేల్చటానికి సిద్ధంచేస్తాను" ఒక నాజీ రచయిత రాసిన నాటకంలో ఒక సైనికుడు అన్న మాటలవి. 1930ల నాటి జర్మనీలో నెలకొంటున్న పరిస్థితులను ఆ మాటలు కళ్లకుకడతాయి. సంస్కృతి అంటే సంప్రదాయాలూ, విశ్వాసాలూ అలవాట్లూ, పండుగలూ, నోములూ, ధర్మాధర్మ ఆలోచనలూ, ఇహలోక-పరలోక చింతనలుగా ఆ రచయిత భావించలేదు. అసలు అట్లాంటి సంస్కృతితో నాజీలకు ఎలాంటి ఇబ్బందీ లేదు. కానీ 1930ల నాటికి సంస్కృతికి ఆ అర్థం మారింది. పరిధి విస్తృతమైంది. భిన్నభావాలు సంఘర్షించే క్షేత్రంగా, హేతుబద్ధ ఆలోచనలకు వేదికగా, ప్రజాస్వామ్య చింతనకు కేంద్రంగా, సమానత్వ భావనకు స్ఫూర్తినిచ్చే ఇంధనంగా సంస్కృతి ఉండాలనే భావన ఆలోచనాపరుల్లో అప్పటికే బలపడింది. అట్లాంటి సంస్కృతి గురించి మాట్లాడినా, కోరుకున్నా వేళ్లు పిస్టల్ ట్రిగ్గర్ మీదకు వెళ్లే విధంగా నాజీలు పాలించారు. ఇప్పుడు అటువంటి భయానక పరిస్థితుల్లేవు. కానీ వాటి ఛాయలూ, ధోరణులూ చాలా చోట్ల కనపడుతున్నాయి. భావప్రకటనా స్వేచ్ఛకు తిరుగులేదనుకునే అమెరికా కూడా వీటి ప్రభావానికి లోనవుతోంది. విశ్వవిద్యాలయాల్లో భావాలపై నిఘాలు పెరుగుతున్నాయి. సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు ప్రకటించే వారి జాబితాలు తయారవుతున్నాయి. ఇజ్రాయెల్ విమర్శకులకు విద్యాలయాల్లో సీట్లు ఇవ్వకూడదనే ఆదేశాలు వెలువడుతున్నాయి. ప్రభుత్వ వ్యతిరేకతను కట్టడిచేయలేని విద్యా సంస్థలకు నిధులు నిలిపేసే చర్యలూ మొదలయ్యాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇంకాస్త ముందుకు వెళ్లి తనతో తీవ్రంగా విభేదించే వారందరినీ వామపక్ష వాద పిచ్చివాళ్లుగా ముద్రవేస్తున్నారు. న్యూయార్క్ నగర మేయర్ ఎన్నికల్లో డెమొక్రాటిక్ అభ్యర్థిగా పోటీచేస్తున్న భారత సంతతికి చెందిన జొహ్రాన్ మమ్దానీకీ ఈ శాపనార్థాలు తప్పలేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో 34 ఏళ్ల జొహ్రాన్ న్యూయార్క్ ఎన్నికల్లో గెలిస్తే అమెరికాలో అదొక మేలిమలుపు అవుతుంది! మరికొన్ని గంటల్లో అక్కడ పోలింగ్ మొదలవుతుంది. ఫలితం ఎలా ఉన్నా జొహ్రాన్ మాత్రం ట్రంప్ బెదిరింపులకు లొంగకుండా ఎదురొడ్డి నిలబడ్డారు. తమ శ్రమతో, నైపుణ్యంతో, ఆలోచనలతో అమెరికా గడ్డను సుసంపన్నంచేసే వారందరికీ సమానావకాశాలు ఉండాలనీ, సమానహక్కులు దక్కాలనీ, సంపద వికేంద్రీకరణ జరగాలన్న వాదనతో ప్రచారం చేశారు. డెమొక్రాటిక్ సోషలిస్టుగా చెప్పుకొనే జొహ్రాన్ ఎన్నడూ తన భావాలనూ దాచుకోలేదు. బహుశా తల్లిదండ్రుల ప్రభావం జొహ్రాన్ మీద గాఢంగా ఉండి వుండొచ్చు. ప్రముఖ దర్శకురాలు మీరానాయర్, ప్రొఫెసర్ మహమూద్ మమ్దానీ.. జొహ్రాన్‌కు తల్లిదండ్రులు. సలాంబాంబే, మిసిసిపి మసాలా, కామసూత్ర, మాన్‌సూన్ వెడ్డింగ్‌లాంటి సినిమాలకు మీరా దర్శకత్వం వహించారు. భారతీయ సినిమాకు అంతర్జాతీయ గుర్తింపును తీసుకుని రావటంలో మీరా పాత్రను విస్మరించలేం. మనల్ని మానవసంబంధాల లోతుల్లోకి తీసుకువెళ్లటమే కాదు.. భిన్న సంస్కృతుల కలయికనూ, దుర్భర పరిస్థితుల్లోనూ మనుషుల్లో తన్నుకుని వచ్చే ఆత్మస్థైర్యాన్నీ, సంప్రదాయ, పాశ్చాత్య ప్రభావాల పరస్పర రాపిడిలో ఎదురయ్యే జీవన సంఘర్షణలనూ మీరానాయర్ అద్భుతంగా చిత్రీకరించారు. మనుషుల జీవితాల్లోని వ్యక్తావ్యక్త అంశాలపై, అనుభూతులపై, ఆకాంక్షలపై, ఆరాటాలపై, అమానవీయాలపై, అసాంఘిక ప్రవృత్తులపై, పథభ్రష్టత్వాలపై ఎంతోకొంత వెలుతురు ప్రసరింపచేసి, మనలో సహానుభూతినీ, సానుభూతినీ, విశాలతనూ, విచారాన్నీ, అంతర్గత మథనాన్నీ పెంచటమే కళ పరమార్థం అనుకుంటే దానికి మీరానాయర్ ఖచ్చితంగా తోడ్పడ్డారు. ఇక మహమూద్ మమ్దానీ అయితే మనం ప్రపంచ రాజకీయాలను చూసే తీరుని మార్చివేయటంలో కీలకపాత్రను పోషించారు. బిన్‌లాడెన్ నేతృత్వంలోని ఇస్లామిక్ తీవ్రవాదులు న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ భవనాలను విమానాలతో ఢీకొట్టించి (11-09-2001) వేలమందిని చంపివేసిన తర్వాత.. అమెరికా నుంచి ఆరంభమైన ఉధృత ప్రచారం సంస్కృతులూ, మతాల మధ్య అసంబద్ధ చీలికను తెచ్చింది. ఇస్లాం సంస్కృతిలోనే తీవ్రవాదాన్నీ, నిరంకుశత్వాన్నీ పెంచిపోషించే తత్వం ఉందనీ.. ఆధునిక జీవనాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ పరిరక్షించుకోటానికి ఆ సంస్కృతితో యుద్ధంచేయక తప్పదనే భావాలకు విపరీత ప్రాచుర్యం లభిస్తున్న నేపథ్యంలో మహమూద్ మమ్దానీ 2005లో ప్రభావవంతమైన పుస్తకాన్ని రాశారు. దాని పేరు మంచి ముస్లిం-చెడ్డ ముస్లిం (గుడ్ ముస్లిం, బ్యాడ్ ముస్లిం). ఆ పుస్తకం కలగచేసిన ప్రభావం అంతా ఇంతా కాదు. అమెరికా ప్రయోజనాలను సమర్థించే వారిని మంచి ముస్లింలు గానూ, వ్యతిరేకించే వారందరినీ చెడ్డ ముస్లింలు గానూ వర్గీకరించటంలో ఉన్న ప్రమాదాన్ని ఎత్తిచూపటంతోపాటు అసలు ఇస్లామిక్ టెర్రరిజాన్ని పాలుపోసి పెంచింది అమెరికానేనని గట్టి ఆధారాలతో మమ్దానీ విశ్లేషించారు. మనిషిలోని బలహీనతలను అధిగమించి అధ్యాత్మిక ఔన్నత్యాన్ని సాధించటానికి నిరంతర పోరాటం చేయాలని చెప్పే జిహాద్ మూల భావనను పెద్దఎత్తున రాజకీయాలకు అన్వయించి, రాజకీయ లక్ష్యాల సాధనకు ఉపయోగించటం ప్రచ్ఛన్న యుద్ధకాలంలో (కోల్డ్‌వార్) మొదలైందనీ, అందుకు కావాల్సిన సాధన సంపత్తిని సమకూర్చటంతోపాటు, అవసరమైన ప్రచారమూ అమెరికా సారథ్యంలోనే సాగిందనీ మమ్దానీ వివరించారు. ఏ దేశంలోనైనా ప్రభుత్వానికి కమ్యూనిజం పట్ల ఎంతోకొంత అనుకూలత ఉందన్న నిర్ధారణకు అమెరికాకు వస్తే.. అక్కడ సోవియట్ రష్యా ప్రభావం పెరిగే ప్రమాదం ఉందని అనిపిస్తే మతవాద శక్తులనూ, తెగల మధ్య ఉండే విభేదాలనూ రెచ్చగొట్టటం అనేక సందర్భాల్లో జరిగింది.


# కొండకరకం గ్రామంలో సీతం ఎన్. ఎస్. ఎస్.యూనిట్ ప్రత్యేక శిబిరం




**విజయనగరం, (రాజధాని వార్తలు):** స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాలకు చెందిన ఎన్.ఎస్.ఎస్. యూనిట్ ప్రత్యేక శిబిరం కొండకరకం గ్రామంలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎన్.ఎస్.ఎస్‌పై అవగాహన పెంచేందుకు క్విజ్ నిర్వహించారు. గెలుపొందిన వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులలో సామాజిక సేవా దృక్పథాన్ని పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని, ప్రతి విద్యార్థి ఎన్.ఎస్.ఎస్.లో చేరాలని పిలుపునిచ్చారు. సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ పుస్తకం ద్వారా విద్యనందిస్తే సరిపోదని, ఆచరణాత్మక శిక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్.ఎస్.ఎస్ - జేఎన్టీయూ - గురజాడ విజయనగరం నోడల్ ఆఫీసర్ ఎన్.సతీష్ కుమార్, సీతం కళాశాల ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్.వి.ఎస్.రాజు సమన్వయం చేశారు. సీతం కళాశాల నుండి 50 మంది వాలంటీర్లు సాయంత్రం వరకు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్‌ను అభినందించారు.

# "జోరు వానలో సైతం కాకాణి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ"





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సర్వేపల్లి నియోజకవర్గం, తోటపల్లి గూడూరు మండల కేంద్రంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ, వైయస్సార్సీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రివర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. జోరు వానను సైతం లెక్క చేయకుండా, కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొని సంతకాలు చేసిన ప్రజలు. ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కళాశాల ఉండాలని 17 కొత్త మెడికల్ కళాశాలలను జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి తీసుకొని వచ్చారు. జగన్మోహన్ రెడ్డి హయాంలోని ఏడు మెడికల్ కళాశాలల నిర్మాణం పూర్తి చేసుకొని, మిగిలిన 10 మెడికల్ కళాశాలల అభివృద్ధిలో ఉన్నాయి. చంద్రబాబు జగన్మోహన్ రెడ్డి తెచ్చిన 17 మెడికల్ కళాశాలలో 10 మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడానికి పూనుకున్నాడు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలను జూన్ 2024 నుండి అమలు చేస్తామని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు సంతకాలు చేసిన బాండ్లను ప్రజలకు పంపిణీ చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ఎగ్గొట్టి, రెండో ఏడాది అరకొరగా పథకాలు అమలు చేయడంతో, లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పథకాల కోసం తిరుగుతున్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో ప్రజలకు అందవలసిన సంక్షేమ కార్యక్రమాలతో పాటు, పేదలకు వైద్యం, విద్య కూడా దూరమయ్యే పరిస్థితులు ఏర్పడతాయి. ప్రజల నుండి సేకరిస్తున్న కోటి సంతకాలను జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో గవర్నర్‌కి అందించి, చంద్రబాబుకు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఆపాలని కోరుతాం. కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి వానను సైతం లెక్క చేయకుండా పాల్గొని, జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున హృదయపూర్వక ధన్యవాదాలు.

# మంత్రి మునీష్క్ మాండవితో భేటీ అయిన పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు








**యానాం (ఢిల్లీ) :** కేంద్ర క్రీడలు యువజన మంత్రిత్వ శాఖల మంత్రి మునీష్క్ మాండవితో బేటీ అయిన పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు సంబంధించినవి : 1.స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా యానాం శాఖలో ప్రస్తుతం ఉన్న రెండు విభాగాలతో పాటు గతంలో ఉండే వాలీబాల్, బాస్కెట్ బాల్, కబడి విభాగాలను ఏర్పాటు చేయాలని, 2. అదేవిధంగా డే స్పోర్ట్స్ శిక్షణ తీసుకునేందుకు స్థానిక బాలురు, బాలికలకు అవకాశం ఇవ్వాలని, 3. కోకో, కరాటే, తైక్వాండో, అథ్లెటిక్స్ విభాగాలు కూడా యానాం శాయ్‌లో ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది. 4.స్విమ్మింగ్ పూల్ (గ్యాలరీ, డ్రెస్ చేంజింగ్ రూమ్స్, టాయిలెట్స్), ఫిట్నెస్ (జిమ్) తదితర మరింత అభివృద్ధికి కేలో ఇండియన్ నుంచి రూ.2.5 కోట్లు కేటాయించాలని కోరడం జరిగింది. యానాం క్రీడ అభివృద్ధికి సంబంధించి 1.మెట్టకూరులోని పాఠశాలలో క్రికెట్ గ్రౌండ్ అభివృద్ధికి ఇప్పటికే పుదుచ్చేరి ప్రభుత్వం నుండి 58 లక్షలు రూపాయలతో అభివృద్ధి పనులు చేయడం జరుగుతుంది. దీనికి అదనంగా మెట్టకురు, దరియాలతిప్ప, సావిత్రి నగర్లలో క్రికెట్ గ్రౌండ్లకు మరో మూడు కోట్ల రూపాయలు కేంద్ర నిధులు కేటాయించాలని కోరడం జరిగింది. 2. గిరియాంపేట కళాశాల సమీపంలో 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్ రు.4 కోట్లు, సావిత్రి నగర్ గ్రౌండ్, కనకాల పేట, దరియాల తిప్ప, గిరియాంపేట, సావిత్రి నగర్‌లలో ఇండోర్ స్టేడియంలో ఉడెన్ కోర్టు తదితర మిగిలిన అబివృద్ది పనులకు రు.3 కోట్లు కేటాయించాలని కోరారు. యానాంకు సంబంధించిన క్రీడ అంశాలపై కేంద్ర మంత్రి మాండవియా సానుకూలంగా స్పందించారని అధికారులతో చర్చించి త్వరలోనే నిధులు విడుదలకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు వివరించారు.

# ఇన్సూరెన్స్ చెక్ అందజేసిన ప్రభుత్వ విప్ దాట్ల



**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం కోరంగి సొసైటీలో ముమ్మిడివరం నియోజకవర్గం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు ప్రమాద భీమా చెక్ అందజేశారు. ఇటీవల కాలంలో కోరంగి వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో కోరంగి ప్రాథమిక సహకార సంఘంలో సభ్యురాలు అయిన ఏ.లక్ష్మి మృతి చెందారు. సొసైటీ అధ్యక్షులు కొప్పిశెట్టి బాబి ప్రతిపాదనలు మేరకు లక్ష్మి కుమారుడుకి రెండు లక్షలు రూపాయలు చెక్కు ను అందజేశారు. ఈ కార్యక్రమంలో తాళ్ళరేవు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ, మందాల గంగ సూర్యన్నారాయణ, పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, కట్టా త్రిమూర్తులు, వినోద్, గోవిందు, ఆదినారాయణ, వెంటపల్లి ఉమామహేశ్వరి, కొప్పిశెట్టి చంటి, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు,

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు విశేష స్పందన




**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ నగర పాలక సంస్థలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్ర మానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. నగరంలోని వివిధ ప్రాంతాల నుండి అర్జీదారులు తరలి వచ్చి తమ సమస్యలను పరిష్కారం కోరుతూ అధికారులకు అర్జీలు అందజేశారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ కె.టి.సుధాకర్ పాల్గొని అర్జీదారుల నుండి స్వయంగా ఫిర్యాదులను స్వీకరించారు. ప్రధానంగా డ్రైనేజీ సమస్యలు, టౌన్ ప్లానింగ్ అంశాలు, రోడ్డు ఆక్రమణలు, రోడ్లపై పశువుల సంచారం, చెట్టు కొమ్మల తొలగింపు, ఇల్లు స్థలాల కేటాయింపు, ఆస్తి పన్నులో పేరు మార్పు వంటి పలు సమస్యలపై దాదాపు 16 మంది అర్జీదారులు తమ వినతులు సమర్పించారు. కమిషనర్ సుధాకర్ ఆ అర్జీలను సంబంధిత శాఖాధికారులకు అందజేసి, తక్షణమే పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. అంతకుముందు నిర్వహించిన "డయల్ యువర్ కమిషనర్" కార్యక్రమంలో నలుగురు పౌరులు ఫోన్ ద్వారా తమ సమస్యలను తెలియజేశారు.


# కోరుట్ల బాబు జగ్జీవన్ రామ్ పార్క్ అభివృద్ధికి వెంటనే నిధులు కేటాయించాలి : మహమ్మద్ ముజాహిద్



**జగిత్యాల్ జిల్లా, కోరుట్ల, (రాజధాని వార్తలు):** కోరుట్ల మున్సిపాలిటీకి తాజాగా వచ్చిన 18 కోట్ల రూపాయల నిధుల్లో నుండి బాబు జగ్జీవన్ రామ్ పార్క్ అభివృద్ధికి తక్షణమే నిధులు కేటాయించాలని సమాజ్ వాది పార్టీ స్టేట్ సెక్రటరీ మరియు యునైటెడ్ ముస్లిం మైనారిటీ రైట్స్ ఆర్గనైజేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ ముజాహిద్ డిమాండ్ చేశారు. కోరుట్ల పట్టణంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడాతూ పట్టణ ప్రజలు కుటుంబాలతో కలిసి విశ్రాంతి తీసుకునే ప్రదేశంగా ఉన్న బాబు జగ్జీవన్ రామ్ పార్క్‌లో ఎలాంటి సౌకర్యాలు లేవని పార్క్‌లో లైటింగ్, బెంచీలు, ట్రాక్, పిల్లల ఆటవస్తువులు వంటి ప్రాథమిక వసతులు లేక దాదాపు లక్ష మంది జనాభా కలిగిన కోరుట్లలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలు చెల్లించే పన్నులు ప్రజల అభివృద్ధికే వినియోగించాలి. మున్సిపాలిటీకి వచ్చిన 18 కోట్లు ఎక్కడ వినియోగిస్తోందన్నది పారదర్శకంగా ప్రజలకు తెలపాలి. అందులో భాగంగా ఈ పార్క్ అభివృద్ధికి వెంటనే నిధులు కేటాయించాలని మేము బలంగా డిమాండ్ చేస్తున్నామని ముజాహిద్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్, టిడబ్ల్యుజెఎ రాష్ట్ర అధ్యక్షులు టైగర్ అలీ నవాబ్, శనిగారపు రాజేష్. మాదిగ సంఘం పట్టణ అధ్యక్షులు శనిగారపు రాజేష్‌లు మాట్లాడుతూ కోరుట్ల పట్టణ అభివృద్ధిలో పార్క్‌లు కీలక పాత్ర వహిస్తాయని, వాటిని నిర్లక్ష్యం చేయడం ప్రజల ఆరోగ్య సామాజిక హక్కులకు విరుద్ధమని తెలిపారు. ప్రభుత్వం మరియు మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించాలని కోరారు.

# చరణ్‌ను ఫాలో అవుతున్న రామ్





తెలుగు సినిమా హీరోల ట్యాగ్ అప్పుడప్పుడు మారుతూ ఉండటం చాలా సందర్భాల్లో చూస్తూనే వచ్చాం. హీరో కెరీర్లో బాగా పైకి ఎదిగినప్పుడో లేదంటే భారీ హిట్ అందుకున్న ప్పుడో, ఆ స్థాయికి తగ్గట్టు కొత్త ట్యాగ్‌ను పెట్టుకోవాలని భావించి, ఆ ఇమేజ్ కు తగ్గ ట్యాగ్స్‌ను పెట్టుకుంటారు. అయితే ఆ ట్యాగ్స్‌ను ఆడియన్స్ అన్నీ సందర్భాల్లో యాక్సెప్ట్ చేయాలని లేదు. ఆర్ఆర్ఆర్ సినిమాతో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న రామ్ చరణ్ ఆ సినిమా తర్వాత తన పేరుకు ముందు గ్లోబల్ స్టార్ అనే కొత్త ట్యాగ్‌ను తగిలించుకుని, పాత ట్యాగ్ అయిన మెగా పవర్ స్టార్‌ను పక్కన పెట్టారు. కానీ చరణ్ గ్లోబల్ స్టార్ అనే ట్యాగ్‌తో చేసిన ఆచార్య, గేమ్ ఛేంజర్ సినిమాలు ఫ్లాపవడంతో ఆ ట్యాగ్ పై నెట్టింట చాలా విమర్శలొచ్చాయి. దీంతో తన నెక్ట్స్ మూవీ కోసం చరణ్ తన పాత ట్యాగ్ అయిన మెగా పవర్ స్టార్‌గానే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఇప్పుడు చరణ్‌ను చూసి మరో యంగ్ హీరో కూడా అదే బాట పడుతున్నట్టు తెలుస్తోంది. అతను మరెవరో కాదు, టాలెంటెడ్ హీరో రామ్ పోతినేని. టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్‌గా మంచి పేరు, గుర్తింపు తెచ్చుకున్న రామ్, ఇస్మార్ట్ శంకర్ సినిమా బ్లాక్ బస్టర్ తర్వాత తన ట్యాగ్ ను ఉస్తాద్ గా మార్చుకున్నారు. ఎనర్జిటిక్ స్టార్ నుంచి ఉస్తాద్‌గా మారినప్పటి నుంచి రామ్ ఇప్పటివరకు హిట్ ను అందుకున్నది లేదు. పైగా ఆడియన్స్, ఫ్యాన్స్ కూడా రామ్‌ను ఉస్తాద్ అనే దానికంటే ఎనర్జిటిక్ స్టార్ అని పిలుచుకోవడానికే ఆసక్తి చూపారు.

అందుకే ఇప్పుడు రామ్ తిరిగి తన పాత ట్యాగ్ కు షిఫ్ట్ అవుతున్నారు. తన తర్వాతి సినిమా ఆంధ్రా కింగ్ తాలూకా కోసం రామ్ ఎనర్జిటిక్ స్టార్ అనే ట్యాగ్ నే పెట్టుకుంటున్నారు. కొత్త ట్యాగ్ లు పెట్టుకోవాలంటే ఫ్యాన్స్ కు ఇష్టముండాలని భావించిన చరణ్, రామ్ ఇకపై తమ పాత ట్యాగ్‌ల తోనే కంటిన్యూ అవాలని ఆసక్తి చూపుతున్నారు.

# బాలయ్య మళ్లీ ద్విపాత్రాభినయం..?



జాట్‌తో హిందీలో కూడా సూపర్ హిట్ అందుకున్న డైరెక్టర్ గోపీచంద్ మలినేని ఈసారి మళ్లీ బాలయ్యతో మరో క్రేజీ మూవీకి రంగ సిద్ధం చేసుకున్నాడు. NBK 111 సినిమా ఒక హిస్టారికల్ బ్యాక్ డ్రాప్ కథతో వస్తుందని తెలిసిందే. ఈ సినిమా లొకేషన్స్ కోసం గోపీచంద్ మలినేని అండ్ టీం రాజస్థాన్‌లో వేట ప్రారంభించారు. ఈ సినిమాతో బాలయ్య పాన్ ఇండియా అటెంప్ట్ చేస్తారని తెలుస్తుంది. ఆల్రెడీ అఖండ 2 సినిమాతో నేషనల్ వైడ్ బజ్ క్రియేట్ చేసుకున్న బాలకృష్ణ ఈసారి గోపీచంద్ సినిమాతో నెక్స్ట్ లెవెల్ క్రేజ్‌తో రాబోతు న్నారు. ఐతే బాలకృష్ణ గోపీచంద్ ఆల్రెడీ వీర సింహారెడ్డి సినిమా చేశారు. ఈ సినిమాలో బాలయ్య ద్విపాత్రాభినయం చేశారు. రెండు పాత్రలు ఫ్యాన్స్‌ని మెప్పించాయి. ఐతే అందులో ఓల్డ్ క్యారెక్టర్ మాత్రం ఫ్యాన్స్ కి ఫీస్ట్ ఇచ్చింది. ఐతే బాలకృష్ణ 111 సినిమాలో కూడా ఇలాంటి ట్విస్ట్ ఉండబోతుందని తెలుస్తుంది. బాలకృష్ణ 111 సినిమాలో కూడా ఆయన డ్యుయల్ రోల్‌లో కనిపిస్తారని తెలుస్తుంది. ఈసారి ఒక రోల్ కాదు రెండు రోల్స్ కూడా ఒకదానికి మించి మరొకటి అనేలా ఉంటాయని తెలుస్తుంది. ముఖ్యంగా హిస్టారికల్ నేపథ్యంలో వచ్చే రోల్‌లో బాలయ్య అదరగొట్టేస్తారని అంటున్నారు. గోపీచంద్ ఈసారి కేవలం మాస్ కథే కాదు కంటెంట్ ఉన్న క్రేజీ స్టోరీతో వస్తున్నారని అంటున్నారు. స్వతహాగా బాలకృష్ణ అభిమాని అయిన గోపీచంద్ ఈ సినిమాతో బాలయ్యను పాన్ ఇండియా స్టార్‌గా నిలబెట్టాలని చూస్తున్నారు. ఆల్రెడీ తెలుగు సినిమాలు పాన్ ఇండియా లెవెల్‌లో సూపర్ సక్సెస్ సాధిస్తున్న ఈ టైంలో బాలయ్యతో గోపీచంద్ అటెంప్ట్ క్రేజీగా మారు తుంది. అంతేకాదు ఈ సినిమా కాస్టింగ్ విషయంలో కూడా గోపీచంద్ జాగ్రత్త పడుతున్నట్టు తెలుస్తుంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కించబోతున్న ఈ సినిమాను కుదిరితే నెక్స్ట్ ఇయర్ ఎండింగ్ లేదా 2027 సంక్రాంతికి రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తు న్నారు. వీర సింహా రెడ్డితో బాలయ్యకు హిట్ ఇచ్చిన డైరెక్టర్ గోపీచంద్ మీద నందమూరి ఫ్యాన్స్ పూర్తి కాన్ఫిడెన్స్ పెట్టుకు న్నారు.

బాలకృష్ణ కూడా అఖండ 2 రిలీజ్ హడావిడి పూర్తి కాగానే నెక్స్ట్ ఆ సినిమాపై ఫోకస్ చేస్తారని తెలుస్తుంది. బాలకృష్ణ 111 సినిమాతో పాటుగా 112వ సినిమాగా ఆదిత్య 999 డిస్కషన్‌లో ఉంది. ఐతే ఆ సినిమాను ముందు బాలకృష్ణ సొంతంగా డైరెక్ట్ చేయాలని అనుకున్నా అది రిస్క్ అనిపించి క్రిష్ డైరెక్షన్‌లో చేయాలని అనుకుంటున్నారట. ఐతే క్రిష్ కూడా రీసెంట్‌గా మంచి ఫాం కనబరచలేదు. అనుష్క ఘాటితో సత్తా చాటతాడని అనుకున్న అతను తీవ్రంగా డిజప్పాయింట్ చేశాడు. మరి క్రిష్ చేతుల్లోనే ఆదిత్య 999 ఉందా మరో డైరెక్టర్‌ని తీసుకుంటారా అన్నది చూడాలి.

# అల్లు అరవింద్ ముందే లాక్ చేసారా?



నిర్మాతగా అల్లు అరవింద్ ప్రస్థానం గురించి చెప్పాల్సిన పనిలేదు. ఎంతో మంది స్టార్ హీరోలతో సినిమాలు చేసారు. నవతరం నటులతోనూ సినిమాలు చేయడం ఆయన ప్రత్యే కత. ప్రతిభావంతుల్ని సైతం ప్రోత్సహించి వెలుగులోకి తెస్తుం టారు. ఇతర నిర్మాతలతో కలిసి గీతా ఆర్ట్స్ నిర్మాణంలోనూ చాలా సినిమాలు నిర్మించారు. సమర్పకుడిగా ఎన్నో సినిమా లకు పని చేసారు. కథ నచ్చిదంటే కొత్త నిర్మాతల్ని ఎంకరేజ్ చేయడంలో ఎంత మాత్రం ఆలోచించరు. తన సంస్థ గీతా ఆర్ట్స్ బ్యానర్ అనే బ్రాండ్ పేరునే పెట్టుబడిగా పెడుతుంటారు. ఆ సంస్థ పేరుతో మార్కెట్‌లోకి సినిమా వచ్చిందంటే ఎంతో ప్రత్యేకంగానే హైలైట్ అవుతుంది. గీతా ఆర్ట్స్‌కి అనుబంధంగా జీఏ2 పిక్చర్స్ కూడా స్థాపించి తన సన్నిహితుల భాగస్వా మ్యంలో సినిమాలు నిర్మిస్తున్నారు. తాజాగా పలు సినిమాలు ఆన్ సెట్స్‌లో ఉన్న సంగతి తెలిసిందే. అందులో ఒకటి ది గర్ల్ ఫ్రెండ్ చిత్రం ఒకటి. నేషనల్ క్రష్ రష్మికా మందన్నా నటిస్తోన్న చిత్రమిది. నిన్న మొన్నటి వరకూ లేడీ ఓరియేంటెడ్ చిత్రంగా హైలైట్ అయిన చిత్రం రిలీజ్ దగ్గరకు వచ్చేసరికి అలాంటి సినిమా కాదంటూ కొత్త ప్రచారం మొదలు పెట్టారు. ఇందులో హీరోగా, రష్మికకు జోడీగా దీక్షిత్ నటిస్తున్నట్లు ప్రకటించారు. అతడి పేరును ఇప్పుడు ప్రధానంగా హైలైట్ చేస్తున్నారు. తాజాగా దీక్షిత్‌తో అల్లు అరవింద్ మరో సినిమా చేయడానికి కూడా ఒప్పందం చేసుకున్నట్లు వెలుగు లోకి వచ్చింది. స్వయంగా ఈ విషయాన్ని దీక్షిత్ వెల్లడించాడు. ది గర్ల్ ఫ్రెండ్‌లో దీక్షిత్ శెట్టి నటన నచ్చి నిర్మాత అల్లు అరవింద్ ప్రత్యేకంగా ప్రశంసించడంతో పాటు, తమ బ్యానర్లో మరో సినిమాకు అవకాశం కల్పించినట్లు వెల్లడించాడు. ఆ సిని మాకు సంబంధించి అడ్వాన్స్ కూడా ఇచ్చినట్లు తెలిపాడు. ఇంతకీ ఎవరీ దీక్షిత్ శెట్టి అంటే ఇతడు కన్నడ నటుడు. తెలుగు సినిమాలు కొత్తేం కాదు. ఐదేళ్ల క్రితమే దీక్షిత్ కెరీర్ టాలీవుడ్‌లో మొదలైంది. 'ముగ్గురు మొనగాళ్లు' సినిమాతో లాంచ్ అయ్యాడు. అటుపై 'దసరా,' ది రోజ్ విల్లాలో నటిం చాడు. 'దసరా' అనంతరం మళ్లీ కన్నడ సినిమాలతో బిజీ అయ్యాడు. మళ్లీ కొంత గ్యాప్ అనంతరం ది గర్ల్ ఫ్రెండ్ లో ఛాన్స్ అందుకున్నాడు. ఈ సినిమాలో హీరో రోల్ కావడంతో? ఫోకస్ అవ్వడానికి ఛాన్స్ ఉంది. మరి హీరో పాత్రను రష్మిక రోల్ డిమాండ్ చేస్తే మాత్రం సన్నివేశం మరోలా ఉంటుంది.

# ఇద్దరి మధ్య జానపదంలో రొమాన్స్!



మాస్ రాజా రవితేజ, ఆషీకా రంగనాథ్ జంటగా కిషోర్ తిరుమల దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. వినోదం, భావోద్వేగం అంశాల నేపథ్యంలో కిషోర్ మార్క్ ఎంటర్ టైనర్‌గా రూపొందుతుంది. రవితేజ మాస్ ఇమేజ్ని పక్కన బెట్టి చేస్తోన్న చిత్రమిది. రవితేజ పాత్ర రెగ్యులర్ చిత్రాలకు భిన్నంగా ఉండబోతుంది. మాస్ రాజా క్లాసిక్ లుక్‌లో కనిపించబోతున్నాడు. కిషోర్ తెరకెక్కించిన గత చిత్రాలు కొన్ని మంచి విజయం సాధించగా, కొన్ని యావ రేజ్‌గా ఆడాయి. డిజాస్టర్‌గా మాత్రం ఇంత వరకూ ఏ సినిమా చేయలేదు. ఈ నేపథ్యంలో కిషోర్ సినిమా అంటే మినిమం ఉంటుందనే అంచనాలు ప్రేక్షకుల్లో ఉంటాయి. ప్రస్తుతం ఈ సినిమా ఆన్ సెట్స్‌లో ఉంది. ఇప్పటికే చిత్రీకరణ ముగింపు దశలో ఉంది. హైదరాబాద్ లో షూటింగ్ శర వేగంగా జరుగుతోంది. దీనిలో భాగంగా రవితేజ-ఆషీకా రంగనాథ్‌లపై ఓ పాట చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ఈ పాట చిత్రీకరణ ఓ భారీ సెట్‌లో జరుగుతోంది. ఇది జానపద నేపథ్యంలో సాగే ఓ రొమాంటిక్ డ్యూయోట్ సాంగ్ అని తెలిసింది. ఇలాంటి బ్యాక్ డ్రాప్లో రవితేజ సాంగ్స్ చేసి చాలా కాలమవుతోంది. గత కొంత కాలంగా ఆయన సినిమాలో పాటలు మాస్ కోణంలో హైలైట్ అవుతున్నాయి. నాయికల తో పాటలు అంతే రొటీన్‌గా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో కిషోర్ తిరుమల అండ్ కో హీరో-హీరోయిన్ల మధ్య పాట కొత్తగా ట్రై చేస్తున్నట్లు కనిపిస్తోంది. పాటల్ని కూడా అందంగా హైలైట్ చేయడం కిషోర్ తిరుమల ప్రత్యేకత. స్టోరీ ఎక్కడా డీవియేట్ కాకుండా కథలో భాగంగా పాటల్ని నడిపించడంలో స్పెషలిస్ట్. ఈ నేపథ్యంలో ఈ జానపద గీతం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రానికి భీమ్స్ సంగీతం అందిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ మధ్య కాలంలో టాలీవుడ్‌లో ట్రెండింగ్ మ్యూజిక్ డైరెక్టర్‌గా మారాడు. వరుస విజయాలతో దూసుకు పోతున్నాడు. అతడు పని చేసిన సినిమాలు మంచి విజయం సాధించడంతో? లైనప్‌లో ఉన్న సినిమాలపై మంచి బజ్ నెలకొంది. కిషోర్ తిరుమల సైతం పాటలపై మంచి అభిరుచి ఉన్న దర్శకుడు. సినిమాను మ్యూజికల్ గా ముందే హిట్ చేయగలడు. దీంతో తాజా సినిమాపై అంచనాలు అంతకం తకు రెట్టింపు అవుతున్నాయి. ఈ చిత్రం కొత్త ఏడాదిలో రిలీజ్ కానుంది. విడుదలకు సంబంధించి ఇంకా ఎలాంటి అప్డేట్ అందించలేదు.

# ఆస్తి, ప్రాణ నష్టాలకు ఆస్కారం లేకుండా ముందస్తు సన్నద్ధత కార్యాచరణలతో సిద్ధం కావాలి : జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్

**డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం, (రాజధాని వార్తలు):** భవిష్యత్తులో మరింత సంసిద్ధతతో కోనసీమ తీర ప్రాంత విప త్తులను ఎదుర్కొనేందుకు గత అనుభవాలను జోడించి తీర ప్రాంత పరిధిలో ఆస్తి ప్రాణ నష్టాలకు ఆస్కారం లేకుండా ముం దస్తు సన్నద్ధత కార్యాచరణలతో సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులకు సూచించారు సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ఉ ద్యోగులతో సమావేశం నిర్వహించి విపత్తులను ఎదుర్కొనడంలో సిబ్బంది అభిప్రాయాలను మెరుగైన విధానాలు, సూచనలను అనుభవాల ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ నేపథ్యంలో అంకితభావంతో కూడిన సేవ, నాయకత్వం సంసిద్ధతలో అవిశ్రాంత కృషి చేస్తూ ఆస్తి ప్రాణ నష్టాలకు తావు లేకుండా చేపట్టిన ఉత్తమ సేవలకు గుర్తింపుగా ప్రశంసా పత్రాలను వివిధ కేడర్ల కు చెందిన 185 మంది ప్రభుత్వ ఉద్యోగులకు బహుకరించినట్లు తెలిపా రు మొంథా తుఫాన్ సహాయక చర్యల తీరు అనుభవాలను అడిగి తెలుసుకొని ప్రతి ఒక్కరూ అంకితభావంతో సేవలం దించడం ప్రశంసనీయ మన్నారు. విపత్తు సమయంలో సహాయక చర్యలు,




ప్రజా సేవ యొక్క అత్యున్నత ప్రమాణాలకు ఉదాహరణగా నిలిచే ఈ సవాలు సమయంలో పౌరుల భద్రత మరియు శ్రేయస్సును నిర్ధారించడంలో ప్రభుత్వ సిబ్బంది నిబద్ధత, అంకుటి త దీక్ష సామర్థ్యాలను జిల్లా కలెక్టర్ కొనియాడారు. ఐదు రోజులపాటు తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో సుమారు 65 శాఖలు ఆస్తి ప్రాణ నష్టాలు తగ్గించడంలో కీలకంగా వ్యవహరించాయన్నారు. ముందస్తు హెచ్చరికలకు అనుగుణంగా లోతట్టు ప్రాంతవాసులను పున రావాస కేంద్రాలకు తరలింపు పునరావాస కేంద్రాలలో భోజనం వసతి కల్పన తుఫాన్ అనంతరం బాధిత కుటుంబాలకు తాత్కాలిక ఆర్థిక సహాయం రూ 3 వేలు అందించడం అదేవి ధంగా 25 కేజీల బియ్యం నిత్యవసర వస్తువులు పంపిణీ వంటి సహాయక చర్యల్లో సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పాల్గొని విపత్తులో సమర్థవంతంగా పనిచేశారన్నారు. ప్రతి శాఖ తమకు అప్పగించిన పనులను నిర్వహించడంలో కీలక భూమిక పోషించిం దన్నారు. ప్రభుత్వ యంత్రాంగంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు వారి కార్యకర్తలు ముంపు సహాయక చర్యలలో సమన్వయం వహించా రన్నారు. భారత వాతావరణ కేంద్ర బ్రాంచ్ స్థానికంగా ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తు న్నట్లు తెలిపారు. రియల్ టైం గవర్నెన్స్ ద్వారా ఎప్పటికప్పుడు ముందస్తు హెచ్చ రికలు తెలిపేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు తీర ప్రాంతంలో ప్రకృతి విపత్తులను తట్టుకునే రీతిలో ఉద్యాన పంటల వంగడాలను ప్రవేశపెట్టాలని సూచించారు.

అదేవిధంగా వ్యవసాయ శాఖలో కూడా సన్న రకం వరి వంగడాలు తుఫాను తట్టుకునే హైబ్రిడ్ జాతులను వినియో గించేలా శాస్త్రవేత్తల సహకారంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. తుఫాన్ తీవ్రతను తగ్గించేందుకై తీర ప్రాంతం వెంబడి అటవీ శాఖ వారు గ్రీన్ బెల్ట్ మడ అడవులు పెంపకం వంటి చర్యలు గైకొనాలనున్నారు. తీర ప్రాంతం వెంబడి ఉన్న 70 తుఫాన్ సెంటర్లలో స్థానిక స్వయం సహాయక సంఘాల సమా వేశాలు నిర్వహించుకునేలా ఏర్పాటు చేయాలని తద్వా రా వాటి నిర్వహణ తీరు మెరుగుపడేందుకు అవ కాశాలు ఉంటాయని తుఫాను విపత్తు సందర్భం లో అన్ని విధాలా ముంపు బాధిత కుటుంబాల తాత్కా లిక వసతికి సౌకర్యవంతం గా ఉంటాయన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సెల్ టవర్స్ ను జిల్లా స్థాయి అధికా రు లు మ్యాపింగ్ చేస్తూ నెలకు ఒకసారి సందర్శించి పనితీ రును పర్యవేక్షించాలన్నా రు. ఏపీ ఈపీడీసీఎల్ వారు స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేసుకుని స్తంభాలు ట్రా న్స్ఫార్మర్లు వంటి మెటీరి యల్ సంసిద్ధంగా ఉంచు కోవాలన్నారు. తుఫాన్ ప్రభావంతో విద్యుత్తు వంటి సౌకర్యాలు కొరవడే తీర ప్రాంత ఆవాసాలలో సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టీ. నిశాంతి,, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, డిఆర్ఓ కే మాధవి, ఆర్డీ వోలు పి శ్రీకర్ డి అఖిల జిల్లా అధికారులు పాల్గొ న్నారు.

# మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలి

## - ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా త్వరిత విచారణ చేసి నిందితుడిని కఠినంగా శిక్షించాలి : ప్రజాసంఘాల ఐక్యవేదిక డిమాండ్

**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం బాణాపురంలో 10 ఏళ్ల బాలికపై జరిగిన పైశాచిక అఘాయిత్యాన్ని ప్రజా సంఘాల ఐక్యవేదిక తీవ్రంగా ఈరోజు అమలాపురం గడియార స్తంభం సెంటర్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది ఈ అమానుష ఘటన మన సమాజానికి సిగ్గుచేటు. బాలికల భద్రతకు భంగం కలిగించే ఇటువంటి చర్యలు అత్యంత హేయమైనవి. తుని ఘటన మరువక ముందే ఇటువంటి ఘటన జరగడం చాలా దారుణం. ఈ ఘటనను అందరూ ఖండించాలని ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ నిందితుడు రాయపురెడ్డి సత్య వెంకట కృష్ణ (బాబీ)ని కఠినంగా శిక్షించాలి. ఇటువంటి పైశాచిక చర్యలకు పాల్పడేవారికి సమాజంలో స్థానం లేదని తేల్చి చెప్పాలి. బాలికకు మెరుగైన వైద్యం, మానసిక ధైర్యం అందించాలి. మహిళలు, బాలికల భద్రతకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే గ్రామంలో నిందితుడు భారీ నేరాలకు పాల్పడిన మరికొంతమంది బాలికలు ఉన్నట్టు సమాచారం వస్తుందని, ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని పోలీసు అధికారులను కోరారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఈ సంద ర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత బాలిక కుటుం బానికి తక్షణమే రూ. 50 లక్షల ఆర్థిక సహాయం అందించాలి. బాధిత బాలికకు ఉచిత విద్య, బాలిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగ భద్రత కల్పించాలి.

బాలిక విద్య అనంతరం ప్రభుత్వం ఉద్యోగం కల్పించే చర్యలు ఇప్పుడే చేయాలి. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కేసు విచారణను 90 రోజులలో పూర్తి చేసి, నిందితుడికి కఠిన మైన శిక్ష విధించాలి విధించాలి. ప్రతి గ్రామం, పట్టణంలో మహిళలు, బాలికల భద్రత కోసం ప్రత్యేక భద్రతా కమిటీలను ఏర్పాటు చేయాలి. అత్యంత సున్నితమైన ఈ కేసు విచారణను పర్యవేక్షించడానికి ఒక ఉ న్నత స్థాయి మహిళా అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా శెట్టి




బత్తుల తులసిరావు, బిఎస్పి నియోజకవర్గ నాయకులు పి. మోహన్ బాబు, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు బంగారు రాజు, నకుల రాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి దుర్గాప్రసాద్, కార్యదర్శి ఎన్ బలరాం, కోశాధికారి కే కృష్ణవేణి, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కే శంకర్, యూటిఫ్ జిల్లా అధ్యక్షులు సురేంద్ర, ఎంటివి సుబ్బారావు, రిటైర్డ్ ఉపా ధ్యాయుల సంఘం నాయకులు ఎం వెంకటేశ్వరరావు, జి గోపాలకృష్ణ, సిపిఐ సీనియర్ నాయకులు కే సత్తిబాబు, జిల్లా కార్యదర్శి రాజేంద్ర, బొంతు రమణ, వీసీకే రాష్ట్ర కార్యదర్శి, ఐద్వా జిల్లా అధ్యక్షులు కార్యదర్శి జి దైవ కృప, డి ఆదిలక్ష్మి, పి. అమూల్య వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ, తాడి శ్రీరామ్మూర్తి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు, బుంగ సత్యనారాయణ మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఏ రవి రాజేష్, పౌర హక్కుల నాయకులు అమరదాసు బాబురావు, గిడ్ల వెంకటేశ్వ రరావు, కార్యదర్శి బాబురావు మానవ హక్కుల వేదిక నామాడి శ్రీధర్ పిడిఎం నాయకులు శివప్రసాద్ జిల్లా కార్యదర్శి చంద్రకళ అంగన్వాడి జిల్లా కోశాధికారి పి అమూల్య కే బేబీ గంగారత్నం మాలమహానాడు సీనియర్ నాయకులు యలంగి సత్యనారాయణ, కెవిపిఎస్ లీగల్ అడ్వాజర్ జీత్తుక సత్యనారాయణ, బిఎస్పి నాయకులు మెండి డేవిడ్, దళిత సేన నాయకులు వాకాపల్లి హరీష్, బిఎస్పి నాయకులు సాపే రమేష్, బిఎస్పి యువ నాయ కులు గెడ్డం విజయ్ కుమార్ పిడిఎఫ్యూ సీనియర్ నాయకులు శ్రీనివాసరావు, కెవిపిఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# అర్జీల పరిష్కారంలో గడువు దాటవద్దు

## - ప్రీ ఆడిట్ ఖచ్చితంగా జరగాలి - మండల ప్రత్యేకాధికారులు వారానికి 4 సచివాలయాలు సందర్శించాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** పిజిఆర్ఎస్కు వచ్చే అర్జీలను గడువు లోపలే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. సోమవారం రెండు శాఖల వద్ద రెండు అర్జీలు గడువు దాటి ఉన్నాయని, పిజిఆర్ఎస్ అర్జీలు గడువు దాటకుండా చూడాలని అధికారులకు సూచించారు. అర్జీదారులకు స్పీకింగ్ ఆర్డర్లో సమాధానాలు ఇవ్వాలని తెలిపారు. సోమవారం సాయం త్రం పిజిఆర్ఎస్ అర్జీల ఆడిట్ పై సమీక్షించారు. ప్రీ ఆడిట్లో ప్రవర్తనాపరమైన లోపాలు, పద్ధతిని అనుసరించే విధానం పై కలెక్టరేట్ కాల్ సెంటర్ నుండి ఆడిట్ టీమ్ అర్జీదారులతో మాట్లాడి ఫోన్ ద్వారా తెలుకోవడం జరుగుతోందని, వారు చెప్పిన విషయాల్ని వాస్తవంగా నమోదు చేయాలని తెలిపారు. అసంతృప్తి శాతం ఎక్కువగా ఉన్న మండలాల తహశీల్దార్ల వద్ద నున్న అర్జీలను మండల ప్రత్యేకాధికారులు సమీక్షించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

మండల ప్రత్యేకాధికారులు వారంలో నాలుగు సచివాలయాలను సందర్శించాలని, అర్జీదారుల నుండి అందిన అర్జీలను ఏ విధంగా పరిష్కరిస్తున్నారనే అంశాలను కూడా తనిఖీ చేయాలని తెలిపారు. వి.ఐ.పి ల నుండి అందే అర్జీలను కూడా వెంటనే పరిష్కరించాలని, సరైన విధంగా పరిష్కరించాలని తెలిపారు. ఈ సమావేశంలో జేసీ సేదు మాధవన్, ఆర్.డి.ఓ శ్రీనివాస మూర్తి, పిజిఆర్ఎస్ నోడల్ అధికారి మురళి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా డివిజనల్ స్థాయి కోకో పోటీలు





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని గంగచొల్ల పెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమ వారం బొబ్బిలి డివిజన్ స్థాయి అండర్ - 14, అండర్ - 17 బాలుర మరియు బాలికల స్కూల్ గేమ్స్ కోకో పోటీలు ఉ త్సాహంగా ఉల్లాసంగా జరిగాయి. జిల్లా కోకో సంఘం కార్యదర్శి, వ్యాయామ ఉపాధ్యాయుడు చింత సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. డివిజన్ స్థాయిలో గల ఏడు మండలాల జట్లు పాల్గొనగా, వారి మధ్య పోటీలు నిర్వహించారు. అనంతరం వీరిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులను డివిజన్ స్థాయి జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన ఈ జట్లు ఈనెల 5వ తేదీన విజ్జి స్టేడియంలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి వెంకటనాయుడు, గ్రామ పెద్దలు కనకల పైడన్న, బోని సంగమయ్య, కనకల మురళి, గౌరీ, ఎస్ఎంసి చైర్మన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోపాడ బంగారురాజు, వివిధ మండలాల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఏసీ స్టేడియంలోని ఫ్రెండ్స్ వాకర్స్‌కు అవార్డుల పంట










**గుంటూరు, (రాజధాని వార్తలు):** సూర్యదేవర కళ్యాణ మండపంలో జరిగిన 203 డిస్టిక్ కాన్ఫరెన్స్ మరియు అవార్డుల ఫంక్షన్ పెంచడం జరిగింది. ఈ సమావేశంలో 2025 లో చేసిన సేవా కార్యక్రమాలు గుర్తించి ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ను బెస్ట్ క్లబ్ అవార్డు బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు కిలారి శ్రీనివాసులునాయుడుకి బెస్ట్ ట్రెజరర్ అవార్డు మాగంటి ప్రసాద్‌కి బెస్ట్ సమ్మర్ క్యాంప్ అవార్డు /బెస్ట్ మెడికల్ క్యాంప్ అవార్డు బెస్ట్ అప్రిషియేషన్ సెక్రటరీ అవార్డు జి నారాయణ రెడ్డికి మొదలగు అవార్డులను కైవసం చేసుకున్నారు. ఈ సమావేశానికి వాకర్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం ప్రభావతి /203 గవర్నర్ పెద్ది శివరాం ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో చెలికాని సీతా రామయ్య, నేతాజీ సుబ్బారెడ్డి, ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరా మయ్య నాయుడు, ఏకొల్లు రాఘవరెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, బెల్లం చెంచయ్య.మన్నేపల్లి సురేష్./పత్తి పాటి రమణయ్య./పులగల సుబ్బారావు./వినుకొండ వెంకటేశ్వర్లు./కె శివయ్య.ఎం ఎన్ చౌదరి తదితరులు హాజరై కార్యక్రమమును జయప్రదం చేయడం జరిగినది.

# పంటల నష్టపరిహారం చెల్లింపునకు సామాజిక తనిఖీ




**గజపతినగరం, (రాజధాని వార్తలు):** "మొంతా"తుఫాన్ కారణంగా పంట నష్టం జరిగిన రైతుల జాబితాలను సోమవారం వ్యవసాయ అధికారులు సామాజిక తనిఖీ చేపట్టారు. మండలంలోని శ్రీరంగరాజపురం, గజపతినగరం, పురిటిపెంట, కాలంరాజుపేట, కొనిస, కొత్తబగ్గం, ఎం. కొత్తవలస గ్రామాలను స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకులు ఏ.నిర్మల జ్యోతి, వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ సందర్శించి నష్టపరిహారం రాసిన రైతుల జాబితాలను పరిశీలన కోసం రైతు సేవ కేంద్రాల్లో వేలాడదీశారు. తుఫాన్ కారణంగా మండలంలో 7.15 హెక్టార్ లలో 60 మంది రైతులకు వరి పంట నష్టం వాటిలినట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గిడిజాల కామునాయుడు, బెల్లాన అచ్చమనాయుడు, రైతులు, వ్యవసాయ సహాయకులు అప్పలనాయుడు, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

# శివనామ స్మరణతో మార్మోగిన శైవ క్షేత్రం

## - పరమేశ్వరుడి దర్శనార్థం వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన ఎస్.ఐ యు.మహేష్






**గజపతినగరం/ బొండపల్లి, (రాజధాని వార్తలు):** మండలంలో త్రయోదశి దినాన వచ్చిన రెండవ కార్తీక సోమవారం నాడు శైవ క్షేత్రాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. ముఖ్యంగా గెద్దపేట గ్రామంలో గల అతి ప్రాచీనమైన, పురాతన శైవ క్షేత్రంలో ఈరోజు తెల్లవారు జాము నుంచే ఆ నీలకంఠేశ్వరుడి దర్శనం కోసం భక్తులు తండోపతండాలుగా వచ్చారు. ఈ క్రమంలో ఆ మహేశ్వరుడి దర్శనంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదని ఎస్.ఐ యు.మహేష్, పోలీస్ సిబ్బందితో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

శివ దర్శనం కోసం ఎస్.ఐ యు.మహేష్ సమకూర్చిన ఏర్పాట్ల పట్ల భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. శైవ దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తనకు సహాయ సహకారాలు అందించిన సిబ్బందికి ఎస్.ఐ యు.మహేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య : ఎస్.ఐ యు.మహేష్

**గజపతినగరం/ బొండపల్లి, (రాజధాని వార్తలు):** మండలంలోని రోళ్లవాక గ్రామంలో ఒక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై యు. మహేష్ విలేకరులకు అందించిన వివరాల ప్రకారం నెల్లిమర్ల మండలం చంద్రమ్మ పేట గ్రామానికి చెందిన బెల్లాన సతీష్(32) కు తండ్రి పెంటయ్య, బొండపల్లి మండలం రోళ్లవాక గ్రామానికి చెందిన శాంతితో వివాహం జరిగింది. సతీష్‌కు మద్యం అలవాటు ఉండటం వలన భార్య శాంతి అతనిని మందలించి మద్యం మానమని అడుగుతూ ఉండేది. భార్య మందలించిందని మనస్థాపానికి గురైన సతీష్ రోళ్లవాకలో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్.ఐ. యు.మహేష్ తెలియజేశారు. మృత దేహాన్ని పంచనామా చేసి పోస్టుమార్టంకు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలియజేశారు. మృతుని భార్య బెల్లాన శాంతి(28)ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ యు.మహేష్ చెప్పారు.



# నిర్విరామ సేవలకు ప్రత్యేక కృతజ్ఞతలు : స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

## - 8 మంది ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ నేపథ్యంలో నిర్వహించిన పదవి విరమణ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్



**ఖమ్మం, (రాజధాని వార్తలు):** ప్రజలకు నిర్విరామంగా సేవలు అందించిన సిబ్బందికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అక్టోబర్ నెలలో పదవీ విరమణ పొందిన 8 మంది సిబ్బంది కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పదవీ విరమణ సన్మాన అదనపు కలెక్టర్‌లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డిలు పాల్గొన్నారు. వైద్యారోగ్య శాఖ పరిధిలో సి. హెచ్. ఓ.గా పని చేస్తున్న బి.అన్నమ్మ, వైరా ఎంపిహెచ్ఈఓగా పని చేస్తున్న జే.జాన్సన్, కుక్‌గా పని చేసిన వి.ఉమాదేవి, ప్లానింగ్ శాఖలోని ఎస్ఓ గోపాల్, జెడ్పీపి ఖమ్మంలో కార్యాలయ సబార్డినేట్ బుచ్చయ్య, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ అభిమన్యుడు పదవి విరమణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ పదవీ విరమణ జీవితంలో చాలా కీలకమైన ఘట్టమని అన్నారు. మనకు గుర్తింపు ఉద్యోగం నుంచి లభిస్తుందని అన్నారు. 30 నుంచి 40 సంవత్సరాల పాటు ప్రభుత్వ రంగంలో సేవలు అందించడం చాలా గొప్ప విషయమని అన్నారు. దశాబ్దాల కాలంగా ప్రజలకు సేవలు అందించి పదవి విరమణ పొందిన ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన సిబ్బందిని సన్మానించడం మన బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఎస్ఓ గోపాల్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఎస్ఓగా పదవి విరమణ పొందడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. వైరా ఎంపిహెచ్ఈఓగా పదవీ విరమణ పొందుతున్న జే.జాన్సన్ మాట్లాడుతూ అధిక సమయం గిరిజన ప్రాంతాలలో, 13 సంవత్సరాల పాటు ఖమ్మం జిల్లాలో విధులు నిర్వహించామని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్‌లు పదవీ విరమణ పొందిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ.పద్మశ్రీ, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికా రులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఉపకరణాలు పరికరములు ఉచిత పంపిణీ క్యాంపు



**రాజన్న సిరిసిల్ల, (రాజధాని వార్తలు):** దివ్యాంగులకు ఉపకరణాలు, సహాయ పరికరములు ఉచిత పంపిణీ చేయుటకు అర్హులైన వారి ఎంపిక కొరకు క్యాంపులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇ.రేవంత్ రెడ్డి, కేంద్ర హోం శాఖా సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, వేములవాడ శాసనసభ్యులు విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాలతో అలింకో సంస్థ ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు మరియు వయోవృద్ధులు ఉపకరణాలు, సహాయక పరికరాలు గుర్తింపు కోసము జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మీరాజం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బోయినపల్లి మండలంలో క్యాంపు నిర్వహించారు. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ రంగ అలింకో సంస్థ సిబ్బంది బ్యాటరీ ఆపరేటర్ సైకిల్స్, వీల్ చైర్స్, దృష్టి లోపము అంధత్వము ఉన్నవారికి స్మార్ట్ ఫోన్లు, బదిరులకు వినికిడి యంత్రాలు, అలాగే వయవృద్ధుల కోసం వీల్ చైర్లు, వాకింగ్ స్టెప్పులు మోకాలు పట్టీలు నడుము పట్టీలు చేతి కర్రలు మొదలైన వాటిలో ఎంపికలు జరిగాయి. ఈ క్యాంపు నందు దాదాపు 400 మంది హాజరై వారి పేర్లను నమోదు చేసుకుని అర్హత గల పరికరాల కోసం దరఖాస్తుల పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ పి లక్ష్మీరాజం, ఎంపీడీఓ జయశిలా, సీడీపీఓ సౌందర్య, ఏసీడీపీఓ సుచరిత, రోజా, డి హబ్ కో ఆర్డినేటర్, ఇంచార్జ్ డిసిపిఓ అంజయ్య, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ స్రవంతి, అలీంకో సిబ్బంది ఐసిడిఎస్ సూపర్వైజర్లలు నిర్మల, శంకరమ్మ, అంగన్వాడీ టీచర్లు ఐసిపిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సమిష్టి కృషితో సత్ఫలితాలు

## - జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, కలెక్టర్, జేసీలను సన్మానించిన జిల్లా అధికారులు





**విజయనగరం, (రాజధాని వార్తలు):** సమన్వయంతో, సమిష్టిగా కృషి చేసినప్పుడే సత్ఫలితాలను సాధించవచ్చని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి స్పష్టం చేశారు. మోంథా తుఫానును ఎదుర్కోవడంలో జిల్లా యంత్రాంగాన్ని సమర్ధంగా నడిపించి, అన్ని రకాల ముందుజాగ్రత్త చర్యలను చేపట్టి నష్టాన్ని గణనీయంగా నివారించిన జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి నుంచి ప్రత్యేకంగా అభినందనలు అందుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌ను, జాయింట్ కలెక్టర్ ఎస్. సేధుమాధవన్‌ను సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి పి.బాలాజీ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తుఫానును ఎదుర్కోవడంలో జిల్లా అధికారులు నుంచి సచివాలయ సిబ్బంది వరకు ప్రతిఒక్కరూ సహకరించారని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సహకారం, సమన్వయంతో ముందుకు వెళ్దామని పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ సేధుమాధవన్‌ను, రాష్ట్రస్థాయి మోంథా అవార్డు గ్రహీతలైన ఇరిగేషన్ ఈ.ఈ వెంకటరమణ, విఆర్వో రాజ్ మోహన్, ఆశా వర్కర్ బంగారమ్మలను ఈ సందర్భంగా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డియార్వో శ్రీనివాసమూర్తి, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# "మోంథా" విజేతలను అభినందించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్

## - అభినందనలు తెలిపిన జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** మొంథా తుఫాన్ సమయం లో తమ తమ రంగాలలో విశేష సేవలు అందించిన ముగ్గురు అధికారులు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా "సైక్లోన్ మోన్తా ఫైటర్ అవార్డులు" అందుకున్న సందర్భంగా రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎస్. రాం సుందర్ రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో అభినందించారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన అధికారులు కూడా ముందుకు సాగాలని కోరారు.

ఈ అవార్డులు అందుకున్నవారు: ఏ. రాజ్ మోహన్, వి.ఆర్.ఓ., కొత్తూరు రామచంద్రపురం నాగావళి నదిపై 24 గంటలు నిఘా ఉంచి, గ్రామాల్లోకి వరద నీరు ప్రవేశించకుండా ప్రమా దకర ప్రాంతాల్లో ఇసుక బస్తాలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల ప్రాణాలను రక్షించారు. వై.బంగారమ్మ, ఆశా వర్కర్, లక్ష్మీ పురం, మెంటాడ మండలం తీవ్ర వర్షాల కారణంగా ప్రధాన రహదారి తెగిపోవడంతో కూడా ఓ గర్భిణిని సురక్షితంగా మరో మార్గం ద్వారా అంబులెన్స్ వద్దకు చేర్చి, తల్లి – శిశువును రక్షించడంలో అపూర్వమైన సేవలు అందించారు. ఎం.వి. రమణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మైనర్ ఇరిగేషన్ జిల్లాలోని 8,000 ఎం.ఐ. ట్యాంకుల రక్షణలో ఫీల్డ్ సిబ్బందిని సమర్థవంతంగా సమన్వయం చేస్తూ, బండ్ల దెబ్బతినకుండా కృషి చేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మరియు కలెక్టర్ మాట్లాడుతూ, "మొంథా తుఫాన్ సమయంలో ప్రజాసేవలో చూపిన వీరి అపూర్వమైన కర్తవ్య నిబద్ధత ప్రభుత్వానికి గర్వకారణం. ఈ అవార్డులు జిల్లాకు గౌరవం తీసుకొచ్చాయి" అని పేర్కొన్నారు.

# కొడకండ్ల, పాలకుర్తి మండలంలో కలెక్టర్ పర్యటన

## - దెబ్బతిన్న ప్రతి పంటను సర్వే చేయాలి - పక్కాగా పంట నష్టం నమోదు

## - రైతులు అధైర్య పడొద్దు : జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్





**జనగామ, (రాజధాని వార్తలు):** మొంథా తుఫాన్ వల్ల ఇటీవల కురిసిన భారీ వర్షాలకి దెబ్బతిన్న పంటలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సోమవారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. కొడకండ్ల మండలం నర్సింగ పురం, ఏడు నూతల, పాలకుర్తి మండలం ముత్తారం గ్రామంలో దెబ్బతిన్న వరి, పత్తి, టమాట పంటలను కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ పరిశీలించారు. ఈ సం దర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....నష్టపోయిన రైతులను ఆదుకునేలా క్షేత్రస్థాయిలో అధికారులు పని చేయాలన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను.. రైతు భరోసా అప్ ద్వారా పంట నష్ట నమోదును పక్కాగా చేయాలన్నారు. వీలైనంత త్వరగా పంట నష్టం నమోదు పూర్తి కావాలన్నారు. మళ్ళీ తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో రైతులు... కోతకి వచ్చిన దాన్యాన్ని... త్వరగా కొనుగోలు కేంద్రాలకి తరలించాలన్నారు. పూర్తిగా తడిచి రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం వద్దకు కాకుండా..నేరుగా బాయిల్డ్ మిల్లుకు తరలించాలి అని పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ సిబ్బంది, వరి ధాన్యం కొనుగోలు కేంద్ర నిర్వాహకులను, వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నర్సింగపురం గ్రామంలోని తిరుమల రైస్ మిల్లును కలెక్టర్ సందర్శించి.... ఎటువంటి తరుగు / కోత లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైస్ మిల్లు నిర్వాహకులను కలెక్టర్ ఆదేశించారు. చివరగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సందర్శించి... తేమ వచ్చిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసి.. ట్యాగ్ చేసిన రైస్ మిల్‌లకు తరలించాలని...ప్రతీ కేంద్రంలో సరిపడా టార్పాలిన్‌లను అందుబాటులో పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోని, మండల వ్యవసాయ, విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
# 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎఫ్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిన్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్‌పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# "జోగి రమేష్ అక్రమ అరెస్టు అన్యాయం": కాకాణి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నకిలీ మద్యం కేసులో అక్రమంగా అరెస్టు చేసి, నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించిన జోగి రమేష్ సోదరులను శాసన మండలి సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ధైర్యం చెప్పిన మాజీ మంత్రివర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. చంద్రబాబు ప్రభుత్వం మాజీ మంత్రి జోగి రమేష్ అన్యాయంగా నకిలి మద్యం కేసులో ఇరికించింది. జగన్మోహన్ రెడ్డి పై తెలుగుదేశం నాయకులు అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ, చంద్రబాబు ఇంటి ముందు నిరసన తెలియజేసిన జోగి రమేష్ పై చంద్రబాబు కక్ష పెట్టుకున్నాడు. ఆనాడు చంద్రబాబు, పచ్చ మీడియా చంద్రబాబు ఇంటిపై దాడి అంటూ సానుభూతి కోసం దుష్ప్రచారం చేసుకున్నాయి. చంద్రబాబు దుష్ప్రచారాలు చేయడంలో దిట్ట. చంద్రబాబు ప్రశ్నించే వారిపై కేసులు పెడుతూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నాడు. నకిలీ మద్యం కేసులో చంద్రబాబు తంబాళ్లపల్లిలో బీఫామ్ ఇచ్చిన వ్యక్తి ప్రధాన నిందితుడు. చంద్రబాబు ప్రధాన నిందితులను దేశం దాటించి, జనార్ధన్ రెడ్డి అనే వ్యక్తి నోటి మాట ఆధారంగా చేసుకుని సంబంధం లేని కేసులో జోగి రమేష్‌ను ఇరికించి, జైలుకు పంపాడు. జోగి రమేష్ తప్పు చేయలేదని ప్రమాణానికి సిద్ధమని సవాలు విసిరినా, చంద్రబాబు తెలుగుదేశం నాయకులు చలించలేదు. తెలుగుదేశం పార్టీ మోపిన అభాండాలు అవాస్తవమని తానే మీ తప్పు చేయలేదని దుర్గామాత దగ్గర జోగి రమేష్ కుటుంబసభ్యులతో కలిసి ప్రమాణం చేశాడు. చంద్రబాబు తన అనుకూలంగా అధికారులతో సిట్ ను ఏర్పాటు చేసి, ప్రశ్నించే వారిపై కేసులలో ఇరికించడంలో భాగమే జోగి రమేష్ పేరును నకిలీ మద్యం కేసులో చేర్చడం. చంద్రబాబు ప్రభుత్వం నకిలీ మద్యం ద్వారా ప్రజల ప్రాణాలు తీస్తుందని ప్రజలు గ్రహించారు. తెలుగుదేశం నాయకులకు అంటుకున్న నకిలీ మద్యం మురికిని జోగి రమేష్ పై అంటించడానికి ప్రయత్నిస్తున్నారు. చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమే జోగి రమేష్ అరెస్ట్. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం శాంతిభద్రతలు కాపాడటంలో విఫలమై, ప్రజలకు, భక్తులకు భద్రత లేకుండా పోయింది.

చంద్రబాబు పోలీసు వ్యవస్థను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల అక్రమ అరెస్టులకు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలువరించుకునేందుకు వాడుకుంటున్నాడు. చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో బ్రిటిష్ పరిపాలనను తలపిస్తుంది. పోలీసు వ్యవస్థ పూర్తిగా అధికార పార్టీకి కొమ్ము కాస్తుంది. జోగి రమేష్ కేసులో కక్ష సాధింపులు కాకుండా, సాక్ష్యాధారాలు న్యాయస్థానాల ముందు పెట్టే దమ్ము పోలీసులకు ఉందా! చంద్రబాబు ప్రభుత్వం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వారిని భయపెట్టి భయాందోళనకు గురిచేయాలని చూస్తుంది. జగన్మోహన్ రెడ్డి చంద్రబాబులాగా పిరికివాడు కాదు. అధికారం ఉంటేనే, చంద్రబాబు రాష్ట్రంలో ఉంటాడు లేకపోతే, రాష్ట్రంలో కనిపించదు. జోగి రమేష్ సోదరులు న్యాయస్థానంలో కడిగిన ముత్యంలా బయటకు వస్తారు. నేడు చంద్రబాబు పొందుతున్న పైశాచిక ఆనందానికి రేపు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జోగి రమేష్ కుటుంబానికి అండగా ఉంటుంది. కూటమి ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మనోధైర్యంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారు. జోగి రమేష్ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం.

# జిజిహెచ్‌లో కొనసాగుతున్న శానిటేషన్ వర్కర్స్ ఆందోళన

## - పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్

**కాకినాడ, (రాజధాని వార్తలు):** పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, నూతన కాంట్రాక్టు సంస్థ కార్మికులతో వేతన ఒప్పందం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో జిజి హెచ్ శానిటేషన్ వర్కర్స్ చేపట్టిన ఆందోళన సోమవారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ, యూనియన్ సీనియర్ మెంబర్ భాగ్యవతిలు మాట్లాడుతూ గత 2 సంవత్సరాలు గా శానిటేషన్ వర్కర్స్‌కి పిఎఫ్ ఈఎస్ఐ కాకుండా 13,500 రూపాయలు జీతం చేతికి అందుతుందన్నారు. ఇటీవల కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతూనే ఉన్నాయన్నారు. ప్రస్తుతం కాంట్రాక్టు 3 సంవత్సరాలు ఉంటుందన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ పోను చేతికి 16,000 రూపాయలు అందాలను కోరుకుంటున్నామన్నారు. కాంట్రాక్టర్స్ సానుకూలంగా స్పందించని పక్షంలో జిజిహెచ్ అధికారులు జోక్యం చేసుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని, అవసరమైతే సమ్మె కూడా చేయాల్సి వస్తుందన్నారు. సోమవారం మధ్యాహ్నం భోజన




విరామ సమయంలో మాతా శిశు విగ్రహం వద్ద నుండి నర్సింగ్ స్కూల్, మెడికల్ విభాగం, క్యాజువాలిటీ మీదుగా సెంటర్ గేటు వరకు నినాదాలతో ప్రదర్శన నిర్వహించారు. యూనియన్ కమిటీ సభ్యురాలు బి.మంగతాయారు, సభ్యురాలు వెంకటలక్ష్మిలు మాట్లాడుతూ జీతం పెరిగే వరకు ఐక్యంగా పోరాడుదామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు పలివెల వీరబాబుతో పాటు సభ్యులు ఆర్.రమేష్, ఎస్.వాసు, ఎం.రవి, బి.కృష్ణ వేణి, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# లయన్స్ బ్రహ్మార్పణ్ కొప్పిశెట్టి లక్ష్మయ్య భోజన క్యారేజీ అందజేసిన యంఎల్ఎ దాట్ల

**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా, తాళ్ళరేవు మండలం తాళ్ళరేవు లయన్స్ క్లబ్‌చే నిర్వహిస్తున్న బ్రహ్మార్పణ్ లయన్స్ ఉచిత అభాగ్యుల భోజన పథకం మొదలై ఈ రోజుకి 1039 వ రోజు. ఈరోజు అన్నదాత" లయన్స్ బ్రహ్మార్పణ్ ట్రస్ట్" ద్వారా తాళ్ళరేవు లయన్స్ క్లబ్ వారిచే అభాగ్యులకు భోజనములు ఏర్పాటు. ఈరోజు ముమ్మిడివరం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ మరియు మురమళ్ళ లయన్స్ క్లబ్ సభ్యులు లయన్ దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) తాళ్ళరేవు జెల్లవారి పేట లో తాళ్ళరేవు లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో నిర్మించిన దివ్యాంగుడు మరియు అభాగ్యుడుచే "నేరేడుమిల్లి ఏడుకొండలు నూతన గృహాన్ని సందర్శించి, బ్రహ్మార్పణ్‌లో పాల్గొని ఏడుకొండలకు భోజనం క్యారేజ్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు పొన్నాడ పేరయ్యరాజు, నరేంద్ర, దత్తు,



వినోద్, బిళ్ళకుర్తి శ్రీనివాస రెడ్డి, భగవాన్, చోడే శ్రీనివాస్ ధూళిపూడి బాబి, స్థానిక నాయకులు కమల, చిరంజీవి, దుర్గాప్రసాద్, విజయ్, చిట్టీ బాబు, గోవిందు, హేమలత, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan